చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
నిరపేక్ష వార్తలు | నిజాయితీ జర్నలిజం | ప్రజల గొంతుక
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com | వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ
# నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 339 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 17 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

## భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక..
### ఇస్లామాబాద్ రాయబారికి సమన్లు

- అంతర్జాతీయ జలాల్లో సెప్టెంబరు 15న ఘటన
- ఘటనలో పెద్దగా నష్టం జరగలేదన్న భారత వర్గాలు
- పాక్ రాయబారికి భారత్ సమన్లు
- పాక్ నౌక వ్యవహారంపై తీవ్ర నిరసన
- 1991 ఒప్పందం ఉల్లంఘించిందన్న భారత్

2



## భారత్‌తో న్యూజిలాండ్ భారీ డీల్..
### 95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గింపు!

- న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం 57 శాతం ఎగుమతులకు వెంటనే సుంకం మినహాయింపు
- పూర్తిస్థాయిలో 95 శాతం ఎగుమతులకు సుంకాల తగ్గింపు
- కివీ పరిశ్రమకు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్ల వరకు ఆదా

2



# ఓటుకు నోటు కేసు..
## రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ

పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం

ఈ అంశంపై విచారణ జరిపే పరిధి ఏసీబీకి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు

నాటి నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని ఎన్నికల ప్రక్రియగానే చూడాలని వాదన



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజా ప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## సెప్టెంబర్ 17 వేడుకలు
- కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి.. రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి





సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు

కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ

రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. లంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

## మోదీ 76వ పుట్టినరోజు : 76 రకాల వంటకాలతో
### తమిళనాడు చెఫ్ వినూత్న శుభాకాంక్షలు

- మోదీ 76వ పుట్టినరోజుకు తమిళనాడు చెఫ్ వినూత్న కానుక
- ఆరోగ్యకరమైన 76 రకాల సలాడ్లతో ప్రత్యేక విందు ఏర్పాటు
- పుచ్చకాయలపై ప్రధాని మోదీ, ఆయన తల్లి హీరాబెన్ చిత్రాల చెక్కడం
- ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమన్న చెఫ్ సెల్వకుమార్

2



## అంతా అబద్ధం..
### రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్



- ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్
- తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి
- గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య

2

## 'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'
- పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు



- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్‌ఓసీ ఆరోపణ
- గంగుల కమలాకర్ భూముల పైనా మంత్రి వ్యాఖ్యలు
- 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి
- 47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి

2

## యూపీఐపై కొత్త రుసుము.. తిరిగి నగదు వైపు అడుగులేనా?

- కొన్ని యూపీఐ లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్
- రూ. 2000 దాటిన వ్యాపార చెల్లింపులపై రుసుము విధింపు
- తిరిగి నగదు లావాదేవీలు పెరగొచ్చని రిటైలర్ల సంఘం ఆందోళన
- వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు లేవని స్పష్టం చేసిన కేంద్రం

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** యూపీఐ ద్వారా జరిగే కొన్ని వ్యాపార లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించడం పట్ల రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం దేశాన్ని మళ్లీ నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 2026 అక్టోబర్ 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ నూతన నిబంధనల ప్రకారం, రూ. 2,000 దాటిన వ్యాపార చెల్లింపులపై ఈ రుసుము వర్తిస్తుంది. కొత్త నిబంధనల మేరకు, వినియోగదారుల నుంచి వ్యాపారులకు జరిగే రూ. 2,000 పైబడిన చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తారు. రైల్వే, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం వంటి రంగాలకు ఫ్లాట్‌గా రూ. 5 రుసుము ఉంటుంది. అయితే, యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా .....

UPI UNIFIED PAYMENTS INTERFACE

2

# 'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'

## .. పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..**
మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. ''అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?'' అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

**మొదటిపేజీ తరువాయి..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సంగారెడ్డిలో గణేశ్ నిమజ్జనం వేళ ఆరుగురు విద్యార్థుల మృతి..



**నేటి శుభోదయ, సంగారెడ్డి :** వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పెదకంజర్ల గ్రామ శివారులో ఉన్న నేరేడు చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదమయమైంది. మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులుగా గుర్తించారు. శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులు గణేశ్ విగ్రహ నిమజ్జనం కోసం నేరేడు చెరువు వద్దకు వెళ్లారు. నిమజ్జనం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వారు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనాథాశ్రమ నిర్వాహకులను పరామర్శించిన ఆయన, ఈ ఘటనపై తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతులను నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా), గణేశ్ (డిప్లొమా), ఉదయ్ కిరణ్ (డిప్లొమా), శ్యామ్ కుమార్ (డిప్లొమా), సిద్ధార్థ్ (10వ తరగతి)గా గుర్తించారు. ఈ హృదయవిదారక ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# యూపీఐపై కొత్త రుసుము.. తిరిగి నగదు వైపు అడుగులేనా?

**మొదటిపేజీ తరువాయి..** నెలకు రూ. 1 లక్ష లోపు లావాదేవీలు నిర్వహించే చిన్న వ్యాపారులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. ఈ మార్పు కేవలం 4 శాతం లావాదేవీలపై మాత్రమే ప్రభావం చూపుతుందని, మిగిలిన 96 శాతం వ్యాపార లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై రిటైలర్ల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. "తక్కువ లాభాలతో పనిచేసే చిన్న వ్యాపారులు ఇకపై యూపీఐ కంటే నగదు లావాదేవీలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది" అని ఆర్ఏఐ సీఈఓ కుమార్ రాజగోపాలన్ పేర్కొన్నారు. దీపావళి పండుగ సీజన్‌కు ముందు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని, ఇది వ్యాపారాలపై మరింత భారం మోపుతుందని క్లాతింగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంతోష్ కటారియా తెలిపారు. గతంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించిన వ్యాపారులే, ఇప్పుడు తిరిగి నగదును ప్రోత్సహించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛార్జీలు ప్రభుత్వ పన్ను కాదని, యూపీఐ వ్యవస్థను నిర్వహించే బ్యాంకులకు, పేమెంట్ యాప్ సంస్థలకు వెళ్లే రుసుము అని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఈ నిర్ణయాన్ని ఐదేళ్ల క్రితమే ప్రతిపాదించామని, దీనిని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. వినియోగదారులపై ఎలాంటి భారం పడదని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. వెరసి, ఈ మార్పుల ప్రభావం వ్యాపారులపైనే ఉంటుంది తప్ప, సాధారణ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

# భారత్‌తో న్యూజిలాండ్ భారీ డీల్.. 95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గింపు!

**మొదటిపేజీ తరువాయి..** భారత్–న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా. సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఇరు దేశాల ఆమోద ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుంది. ఈ ఏడాది చివర్లోనే ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెక్లే చెప్పారు. 2030 నాటికి భారత్–న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాని కి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. వెస్ట్‌పాక్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన నివేదికలోనూ భారత్ వృద్ధి అవకాశాలను ప్రస్తావించింది. ఎఫ్‌టీఏ వల్ల వచ్చే పదేళ్లలో న్యూజిలాండ్ జీడీపీకి దాదాపు 0.1 శాతం అదనపు వృద్ధి రావచ్చని అంచనా వేసింది.

# భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక..

## ఇస్లామాబాద్ రాయబారికి సమన్లు

**మొదటిపేజీ తరువాయి..** అరేబియా సముద్రంలో భారత నౌకాదళానికి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నేవీకి చెందిన నౌక ఢీకొన్న ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్ హైకమిషన్ చార్జ్ డి అఫైర్స్ సాద్ అహ్మద్ వారైచ్‌ను బుధవారం విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. పాకిస్థాన్ నౌకాదళ యూనిట్ వ్యవహరించిన తీరు ''ఆమోదయోగ్యం కానిది, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధం'' అని భారత్ పేర్కొంది. ఈ ఘటన నిన్న (సెప్టెంబరు 15) సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో అంతర్జాతీయ జలాల్లో జరిగినట్లు సమాచారం. సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత నౌకకు పాకిస్థాన్ నౌక వేగంగా సమీపానికి వచ్చి, సురక్షితం కాని రీతిలో దిశ మార్చుకుంటూ వచ్చి ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. ఘటనలో పెద్దగా నష్టం జరగలేదని పేర్కొన్నాయి. పాకిస్థాన్ నౌక వ్యవహరించిన తీరు 1991లో భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందంలోని ఆర్టికల్ 10కు విరుద్ధంగా ఉందని విదేశాంగ శాఖ తెలిపింది. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా పాకిస్థాన్ సైనిక యూనిట్లు సముద్రంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరు దేశాల మధ్య ఉన్న ఒప్పందాలను గౌరవించాలని ఆ దేశ రాయబారికి భారత్ సూచించింది. ఈ సందేశాన్ని పాకిస్థాన్ విదేశాంగ శాఖకు చేరవేయాలని ఆదేశించింది. ఇదే సమయంలో ఇస్లామాబాద్‌లోని భారత చార్జ్ డి అఫైర్స్ కూడా పాకిస్థాన్ విదేశాంగ శాఖకు అధికారికంగా నిరసన తెలియజేయాలని కేంద్రం సూచించింది.

# మోదీ 76వ పుట్టినరోజు : 76 రకాల వంటకాలతో తమిళనాడు చెఫ్ వినూత్న శుభాకాంక్షలు



**మొదటిపేజీ తరువాయి..** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు (సెప్టెంబరు 17) సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలకు ఏర్పాట్లు జరుగుతుండగా, తమిళనాడుకు చెందిన ఓ చెఫ్ తన అభిమానాన్ని అత్యంత వినూత్నంగా చాటుకున్నారు. ప్రధాని మోదీకి 76 ఏళ్లు నిండిన సందర్భంగా, ఏకంగా 76 రకాల వంటకాలను సిద్ధం చేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడులోని తిరునల్వేలికి చెందిన ప్రముఖ చెఫ్ సెల్వకుమార్ ఈ అరుదైన కానుకను సిద్ధం చేశారు. కేవలం వంటకాలతోనే ఆగకుండా, పుచ్చకాయలపై ప్రధాని మోదీ, ఆయన దివంగత తల్లి హీరాబెన్ మోదీ చిత్రాలను అందంగా చెక్కారు. ప్రధాని యువకుడిగా ఉన్నప్పటి చిత్రం, ప్రస్తుత రూపాన్ని కూడా పుచ్చకాయలపై ఆవిష్కరించి తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆరోగ్యకరమైన, సహజ సిద్ధమైన ఆహారాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 'నో–కుక్' (వండకుండా చేసే) థీమ్‌తో ఈ 76 రకాల వంటకాలను తయారు చేయడం విశేషం. వీటిలో 24 రకాల కూరగాయలు, పండ్లతో చేసిన సలాడ్లు, 26 రకాల మొలకెత్తిన పప్పులతో చేసిన సలాడ్లు, 14 రకాల దుంపలతో తయారుచేసిన సలాడ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా చెఫ్ సెల్వకుమార్ మాట్లాడుతూ, ప్రధాని మోదీపై తనకున్న అభిమానాన్ని చాటుకునేందుకే ఇలా చేశానని తెలిపారు. సహజసిద్ధమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రజలకు తెలియజేయడానికే ఈ 76 రకాల వంటకాలు సిద్ధం చేశానన్నారు. ప్రధాని ఆయురారోగ్యాలతో ఉంటూ దేశానికి మరిన్ని సేవలు అందించాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు. కాగా, సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం సెల్వకుమార్ సిద్ధం చేసిన ఈ ప్రత్యేక వంటకాలు, పుచ్చకాయల చిత్రాలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాయి.

## నర్సింగ్ పల్లిగ్రామం లో వైభవంగా 'ఇందిరమ్మ ఇల్లు' భూమిపూజ

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ప్రజాప్రభుత్వంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయమని, అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయడం జరుగుతోందని గ్రామ సర్పంచ్ శ్రీమతి తెడ్డు సుగుణ రాజేశ్వర్ తెలిపారు.సిరికొండ మండలం నర్సింగ్ పల్లి గ్రామానికి చెందిన కైతా దీన గారికి, రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ భూపతి రెడ్డి గారి ప్రత్యేక కృషితో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ సందర్భంగా బుధవారం రోజున గ్రామ సర్పంచ్ తెడ్డు సుగుణ రాజేశ్వర్ గారి ఆధ్వర్యంలో లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి సాంప్రదాయబద్ధంగా ముగ్గు పోసి (భూమిపూజ చేసి) పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా లబ్ధిదారుడు శ్రీ కైతా దీన మరియు వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... తమలాంటి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, అలాగే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇల్లు మంజూరు చేయించిన



ఎమ్మెల్యే శ్రీ భూపతి రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రావణకుమార్, పంచాయతీ కార్యదర్శి పాషా, బి.ఎల్.ఓ (BLO) నవీన్, గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిరికొండ 1వ వార్డులో నూతన సిసి మురికి కాలువ నిర్మాణానికి భూమిపూజ



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** సిరికొండ మండల కేంద్రంలోని 1వ వార్డులో నూతనంగా నిర్మించనున్న సిసి (CC) మురికి కాలువ నిర్మాణ పనులకు సర్పంచ్ మల్లెల సాయి చరణ్ శంకుస్థాపన (భూమిపూజ) చేశారు. వార్డు ప్రజల డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వార్డు అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. వార్డుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడమే తమ మొదటి లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్యామ శోబన్, గ్రామ కార్యదర్శి వినిల్, జీపీఓ మాణిక్యం, వార్డు సభ్యులు యెల్లయ్య, అశ్విని, లత, మురళి, సునీత, రంజిత్, అమృత, తిరుపతిలతో పాటు కరబార్ ప్రవీణ్, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి

- **మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం**

**మేడ్చల్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించి, అర్హత కలిగిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు బుధవారం మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి యజమానులు క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు తదితర వ్యవహారాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూములను సంబంధిత అధికారులు పరిశీలించి, అర్హత ఉన్న భూములపై సత్వరమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న భూ సమస్యలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఒకేసారి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. భూ రికార్డులను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన అనంతరం అర్హత కలిగిన భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో




తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నరసింహ, అరవింద్ కుమార్ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంటరీ అధ్యక్షుడు కందికంటి అశోక్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుంకర వెంకటేష్, మల్కాజిగిరి పార్లమెంట్ అడహాక్ కమిటీ సభ్యులు కరణం గోపి, చంద్రశేఖర్, రామకృష్ణ, తెలుగు యువత జనరల్ సెక్రటరీ నరేష్ ముదిరాజు, జవహర్‌నగర్ అధ్యక్షుడు నామాల సురేష్, వెంకటరమణ, దమ్మాయిగూడ అధ్యక్షుడు కృష్ణారావు, నాగారం అధ్యక్షుడు కొండ జంగారెడ్డి, నాయకులు నాగరాజు, తండాలపల్లి శంకర్, కాప్రా సీనియర్ నాయకుడు రాములు యాదవ్, తెలుగు మహిళా నాయకురాలు ఆశాబ్దింతు, ఉమాశంకర్ గౌడ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## హాకీ అకాడమీకి తూంపల్లి విద్యార్థుల ఎంపిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల అభినందనలు

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** సిరికొండ మండల పరిధిలోని తూంపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు తమ క్రీడా ప్రతిభతో రాష్ట్ర స్థాయి SATS (తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ) హాకీ అకాడమీకి ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ నగేష్ బుధవారం తెలిపారు.అకాడమీకి ఎంపికైన వారిలో బుఖ్య జలజ, బొల్లబోయిన జశ్వంత్, బాదావత్ చికిత, బుఖ్య అఖిల, బోడా రూపిక ఉన్నారు. వీరు కనబరిచిన అత్యుత్తమ ప్రదర్శనకు గాను రాష్ట్ర స్థాయి అకాడమీలో శిక్షణ పొందే అవకాశాన్ని దక్కించుకున్నారని పీఈటీ తెలిపారు.రాష్ట్ర స్థాయికి ఎంపికై గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను సర్పంచ్ రాజేందర్, ఎంఈఓ రాములు, హాకీ అసోసియేషన్ ప్రతినిధులు మరియు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత




శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఏల్గొండగూడలో ఘనంగా మహాగణపతి పూజ



**షాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** షాబాద్ మండలంలోని ఏల్గొండగూడ గ్రామంలో మహాగణపతి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనీ గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి,సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామంతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని స్వామివారిని ప్రార్థించారు.అలాగే ‘సర్వేజనా సుఖినోభవంతు’ అనే ఆకాంక్షతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. అనంతరం పూజా కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ పూజా కార్యక్రమంలో శ్రీనివాసచారి, మల్లారెడ్డి, ఆంజనేయులు గౌడ్, కృష్ణమాచారి, బలరాం, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామడుగు గ్రామంలో స్మార్ట్ స్టేషన్ కార్డుల పంపిణీ

**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోలం రాజేశ్వర్, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




## దున్నే వాడికి భూమి వెట్టి చాకిరి విముక్తి కై -సాయుధ రైతాంగ పోరాటం

- **సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** బుధవారం యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం ,అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు స్థూపాలకి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ హాజరై మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామాల్లో దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని అని అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మేడిపల్లి గ్రామంలో కూడా ఉన్న దొరల భూస్వాముల దోపిడీ దౌర్జన్యానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా గ్రామంలో ఉన్న భూములు దున్నేవానికే భూములు దక్కాలని కామ్రేడ్ కృష్ణమూర్తి నాయకత్వాన జరిగిన పోరాటంలో కామ్రేడ్ వడ్డేమోని సత్తయ్య బూరె మల్లయ్య ఆలంపల్లి ఎల్లయ్య గడ్డం మల్లయ్య గడ్డం చెన్నయ్య ఎర్రజెండా రాములు బోడ మల్లయ్య పివిష్ణుమూర్తికర్నాటి రంగారెడ్డి కీలక పాత్ర పోషించారు.తెలంగాణ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన 4,500 మంది తమ ప్రాణాలు అర్పించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని అన్నారు 3,000 గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పడిందని అన్నారు అదేవిధంగా 10 లక్షల ఎకరాలు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఏ సంబంధం లేని బిజెపి పార్టీ చరిత్రను వక్రీకరించే విధంగా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వక్రీకరించే విధంగా ప్రయత్నం చేస్తే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గ్రామంలో యువత వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఆలంపల్లి జంగయ్య ,ఎస్ ,చందు నాయక్ మండల కమిటీ సభ్యులు ,ముచ్చర్ల లాజర్ ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి ,వి భూషణ్ శాఖ కార్యదర్శిలు ,ఆలంపల్లి యాదయ్య, గడ్డం కుమార్, ఆలంపల్లి పెంటయ్య ,9వ వార్డు సభ్యులు అల్లంపల్లి మహేష్ సిపిఎం నాయకులు మల్లయ్య,వేణు,దేవయ్య ,యాదయ్య,నరసింహ ,ఎండి బాషీద్ ,గఫూర్ శ్రీకాంత్ ,రాజు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీ ఎన్ ఆర్ ఫుట్‌వేర్ నూతన షాప్ ప్రారంభం...



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** భద్రాచలం ఆంధ్రా బ్యాంక్ రోడ్డులో మెన్స్ క్లబ్ ఫ్యాషన్స్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జీఎన్ఆర్ ఫుట్ వేర్ షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుంజా ధర్మా రావు, కుంజా సంతోష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కుంజా సంతోష్ మాట్లాడుతూ స్థానికంగా చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి, యువ వ్యాపారవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక వ్యాపారాల అభివృద్ధికి ప్రజల సహకారం, ప్రోత్సాహం ఎంతో అవసరమని పేర్కొన్నారు.జీఎన్ఆర్ ఫుట్ వేర్ నిర్వాహకులు గన్నవరపు ముత్యాలరావు శ్రీమతి మౌనిక చిన్న స్థాయి నుంచి వ్యాపారాన్ని ప్రారంభించి క్రమంగా అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆయన వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఇర్పా అనసూయ, సున్నం భూలక్ష్మి , కేత వరపు రామకృష్ణ,భూక్య సాయి కౌశిక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి





**ఏన్కూర్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతు పోరాటం చరిత్రలో గొప్ప పోరాటమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత్ రావు పేర్కొన్నారు. ఏన్కూర్ మండలం మేడపల్లి గ్రామంలో లో తాటి సత్యం, తాటి సీతమ్మ స్తుపాల వద్ద జరిగినా సభలో ఆయన పాల్గొన్నారుముందు స్తుపల వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ జెండా ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంత్ రావు మాట్లాడుతూ.... నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, జమీందార్లు, జగి ర్దారులకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం 5 వేల గ్రామాలను,10 వేల ఎకరాలు భూమి పంచిన చరిత్ర కమ్యునిస్టులకు ఉందన్నారు. అదే స్పూర్తితో తెలంగాణ ను విముక్తి చేసి భారతదేశంలో విలీనం చేయడంలో ఆనేక కమ్యూనిస్టుల ప్రాణ త్యాగలతో జరిగిందని, అలాంటి గొప్ప పోరాటాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి డిమాండ్ చేశారు. నల్లమల గిరి ప్రసాద్ దళంలో పని చేసిన తాటి సత్యం తాటి సీతమ్మ ధన్య జీవులన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు యర్రా బాబు, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, జిల్లా సమితి సబ్యులు అమరనేని వీరభద్రం, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంబాబు, మండల నాయకులు మదినేని రమేష్, గ్రామ సర్పంచ్ బండ్ల స్వాతి,కృష్ణారావు, తిరుపతమ్మ, సూరమ్మ తో పాటు కుటుంబ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను సందర్శించిన మండల ప్రత్యేక అధికారి





**ఏన్కూర్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయాన్ని బుధవారం మండల ప్రత్యేక అధికారి ఎండి ముజాహిద్ ఖాన్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను, గ్రంథాలయాన్ని, డార్మెంటరీ, భోజన శాల, వంట గదులను పరిశీలించారు. టి ఎల్ ఎం తో ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. చిన్ననాటి నుండే క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, ఎంఈఓ వాసవి దేవి,ప్రిన్సిపాల్ వేము రాజు, ఏటీపీ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు

# విపత్తుల వేళ తక్షణ స్పందనకు యువ ఆపదమిత్రలు సిద్ధంగా ఉండాలి : కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** విపత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగించడంలో ఆపదమిత్రలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాత కొండలోని 6వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బెటాలియన్‌కు చేరుకున్న కలెక్టర్‌కు సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భౌగోళిక, వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి వరదలు, ఆకస్మిక వరదలు, పట్టణ ప్రాంతాల్లో నీటిముంపు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున స్థానికంగా శిక్షణ పొందిన యువత అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు ఆపదమిత్రలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు.విపత్తుల సమయంలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక అప్రమత్తత, సమయ స్ఫూర్తి, పరిస్థితులను వేగంగా అంచనా వేసే సామర్థ్యం, సరైన నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఎంతో కీలకమని అన్నారు. శిక్షణలో ప్రామాణిక నిర్వహణ విధానాలు, సమాచార ప్రసారం, రెస్క్యూ పరికరాల వినియోగం, బృంద సమన్వయం వంటి అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. విపత్తు నిర్వహణ కేవలం తరగతి గదికే పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో నిరంతర సాధన, మాక్ డ్రిల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అవసరమైన రెస్క్యూ పరికరాలు, కిట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.6వ బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ మాట్లాడుతూ విపత్తులు సంభవించిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమన్నారు. అధికారిక సహాయక బృందాలు చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు వేగంగా స్పందించి ప్రాథమిక సహాయక చర్యలు చేపట్టగలరని తెలిపారు. శిక్షణలో బోట్ నిర్వహణ, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, పైకి ఎక్కడం, కిందికి దిగడం, రాక్ క్లైంబింగ్, వివిధ రకాల ముడుల వినియోగం వంటి ప్రాక్టికల్ అంశాలను నేర్చుకోవాలని సూచించారు.అనంతరం ఆపదమిత్రలకు కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా శిక్షణ కిట్లను అందజేశారు. విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనే యువతకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఆపదమిత్రకు మూడేళ్ల కాలానికి రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 416 మంది ఆపదమిత్రులకు శిక్షణ ఇవ్వనున్నామని, తొలి విడతగా 120 మందికి శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు.జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాల మేరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ అందిస్తున్నారు. నెహ్రూ యువ కేంద్రాలు, ఎన్ఎస్ఎస్, మై భారత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ తదితర సంస్థల ద్వారా ఎంపికైన యువతకు శిక్షణ ఇస్తున్నారు. సెప్టెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు జరిగే శిక్షణలో విపత్తుల రకాలు, ప్రకృతి, మానవ తప్పిదాల వల్ల సంభవించే విపత్తులు, ముందస్తు చర్యలు, విపత్తుల సమయంలో స్పందన, అనంతర సహాయక చర్యలు, ప్రథమ చికిత్స, రెస్క్యూ పరికరాల వినియోగం, బోట్‌ను అమర్చడం, విడదీయడం, ప్రారంభించడం, నిర్వహణ, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, రాక్ క్లైంబింగ్, వివిధ రకాల ముడులపై సైద్ధాంతిక, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజు, అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, శిక్షకులు, ఆపదమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి హనుమంతరావు చొరవతో కౌకూర్ అభివృద్ధికి బాటలు

- **కౌకూర్‌ను మోడల్ కౌకూర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: తుడిమెళ్ల మల్లికార్జున్**



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** కౌకూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ కౌకూర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చొరవతో కౌకూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు.కౌకూర్ బస్‌స్టాప్ జంక్షన్‌లోని వినాయక నిమజ్జన చెరువు వద్ద మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పర్యటించి వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం జోనల్ కమిషనర్ సాంచిత్ గంగ్వార్, డీఈ పద్మలతతో కలిసి కౌకూర్ బస్‌స్టాప్ సర్కిల్ అభివృద్ధిపై సమీక్షించారు.కౌకూర్ బస్‌స్టాప్‌ను ప్రధాన జంక్షన్‌గా అభివృద్ధి చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. జంక్షన్ అభివృద్ధికి ఇప్పటికే పలుమార్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులతో కలిసి పరిశీలనలు నిర్వహించినట్లు మల్లికార్జున్ తెలిపారు. విద్యుత్ స్తంభాల మార్పిడికి సంబంధించిన ప్రక్రియ ప్రస్తుతం అంచనా దశలో ఉందని, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పనులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు."కౌకూర్‌ను మోడల్ కౌకూర్‌గా తీర్చిదిద్దడమే మా ప్రధాన లక్ష్యం. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజల అవసరాలే మా మొదటి ప్రాధాన్యత" అని మల్లికార్జున్ పేర్కొన్నారు.2024లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న మైనంపల్లి హనుమంతరావు చొరవతో అల్వాల్ మున్సిపల్ పరిధిలోని కౌకూర్‌లో వినాయక నిమజ్జన చెరువు ఏర్పాటు జరిగిందని ఆయన గుర్తుచేశారు. కౌకూర్ ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆయన నాయకత్వంలో ముందుకు సాగాయని తెలిపారు.కౌకూర్ అభివృద్ధికి మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి సహకారం కూడా కీలకంగా ఉందని మల్లికార్జున్ తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వివిధ శాఖలతో సమన్వయం చేస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన సహకరిస్తున్నారని పేర్కొన్నారు.చాలా రోజుల తర్వాత మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ తమతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, కౌకూర్ అభివృద్ధికి ఆయన సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మల్లికార్జున్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, అలీ మల్లేష్, అసిఫుల్లా ఖాన్, అలీ పాండు, సయ్యద్



అస్లాం, గౌరీనాథ్, గోమారం అంజిరెడ్డి, ధర్మారావు, కృష్ణ ముదిరాజ్, వెంకటేశ్వర్లు, సత్తి రెడ్డి, చిత్ర గోకుల్, పుష్ప, వాణి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు..

- **గణేష్ నవరాత్రి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పురోహితుడు పందిళ్లపల్లి వెంకటేశ్వర్లు**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవ మండపాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో పురోహితుడు పందిళ్లపల్లి వెంకటేశ్వర్లు (మిత్తి అయ్యాళ్వార్) ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.సనాతన హిందూ ధర్మాన్ని అనుసరిస్తూ ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు నిత్య వైష్ణవ సంప్రదాయాలు, హిందూ ధర్మ తత్వాలను ప్రజలకు వివరిస్తున్నారు. గణేష్ మండపాల వద్ద భజనలు, హరినామ సంకీర్తనలు, కోలాటాలు నిర్వహిస్తూ భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు భావితరాలకు మంచి సందేశాన్ని అందించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.నవరాత్రి ఉత్సవాలు పూర్తయ్యే వరకు గ్రామాల్లో బెల్ట్‌షాపులు, మద్యం విక్రయాలు, నాటుసారా అమ్మకాలను నిషేధించాలని అధికారులను కోరారు. గ్రామాల్లో వివిధ రకాల మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టి, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# వెల్జాల్‌లో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

- **ఎమ్మార్వోకు సర్పంచ్ రాములమ్మ వినతి**



**తలకొండపల్లి, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల సౌకర్యార్థం అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్వో రమేష్, ఆర్ఐ శ్రవణ్‌లకు వినతిపత్రం అందజేశారు.వెల్జాల్ గ్రామపంచాయతీకి చెందిన పలువురు ఓటర్లు ప్రస్తుతం ఇతర గ్రామపంచాయతీల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వస్తోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంకటాపూర్‌లోని 44వ పోలింగ్ కేంద్రంలో వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నంపల్లి, ఇస్రాయిపల్లి గ్రామాలకు చెందిన ఓటర్లు ఉన్నారని తెలిపారు. అలాగే మదయపల్లి 47వ పోలింగ్ కేంద్రంలోనూ వెల్జాల్ గ్రామపంచాయతీకి చెందిన ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.ఇతర గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న వెల్జాల్ గ్రామ పంచాయతీ ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకువచ్చి, వెల్జాల్ గ్రామంలో అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనివల్ల ఓటర్లు తమ ఓటు హక్కును సులభంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్‌కుమార్, గ్రామ నాయకులు ఎం.ఏ. అజీజ్, సీహెచ్. విష్ణువర్ధన్ యాదవ్, వానరాశి వెంకటేష్, సుభాన్, వి. శేఖర్, మస్క వెంకటయ్య, పి. సుల్తాన్, ఎల్. రమేష్, వి. బాలరాజ్, విజయ్ యాదవ్,బి. జంగయ్య, గ్రామ పెద్దలు యువకులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం

## - రక్షిత కౌల్దార్ చట్టం అమలు

- **సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య.**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
యాచారం మండల పరిధిలో ధర్మన్నగూడ గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.దున్నే వాడికి భూమి పంచాలని వెట్టి చాకిరీ నశించాలని సాగిన తెలంగాణ సాయూదా రైతంగా పోరాటా పలితంగా నే అనేక భూచట్టాలు.రక్షిత కౌలు దారు చట్ట ప్రకారమే పేదవాడి చేతికి భూములు వచ్చినవి.తెలంగాణ సాయుదా రైతంగా పోరాట వారోత్స వాల్లో భాగంగా బుధవారం సింగారం గ్రామంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్బంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు పి అంజయ్య మాట్లాడుతూ,లక్షలాది ఎకరాల భూములు భూస్వాముల దగ్గర పెట్టుకొని వెట్టి చెహించు కునేవారు, దున్నే వాడికి భూమి కావాలని నైజం రజాకార్లు భూస్వాములు కలిసి ప్రజా పై చేసిన దోపిడీ దౌర్జన్యాలు నశించాలని భూస్వాములు జాగీర్ దారులు. సాగించిన దాడులు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎర్ర జండా నాయకత్వంలో ఆంధ్ర మహసభ పేరుతో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య .అమరత్వంతో సాగిన మహత్తర తెలంగాణ సాయూదా రైతంగా పోరాటంలో నైజం రజాకార్లను,భూస్వాములను తరిమి కొట్టి 4000 వెల మంది కమ్యూనిస్టుల హత్మబలిదాణంతో 3000 వేల గ్రామాలు విముక్తి చెంది.గ్రామ స్వరాజ్యాలు ఏర్పడి10 లక్షలఎకరాల భూములు పంచడం జరిగింది.ఈ సందర్బంగా అనేక భూచట్టాలు సీలింగ్ ,గైరాన్ టేనెంట్ ,రక్షిత కౌల్ దారు చట్టం,పోరంబోగ్ తదితర చట్టాలు వచ్చినవి.కాబట్టే మన గ్రామాలల్లో 1400 ఎకరాల భూములు రక్షిత కౌల్దార్ చట్ట ప్రకారంగా 4 గ్రామాల పేదరైతులకు భూమి వచ్చినా ఇప్పటి పట్టాలు చేయక పోవడం సిగ్గుచేటు. ఇబ్రహీంపట్నం ఈ ప్రాంతంలో భూస్వాముల కబంద హస్తలకింద వున్నా వేలాది ఎకరాల భూముల పైన,కృష్ణ మూర్తి (రాగన్న ) నాయకత్వంలో ,పోచమోని జంగయ్య బర్ల శివయ్య,కోటప్ప,అడివయ్య, కుకూడాలా జంగారెడ్డి,గ్రామాలలో ప్రజలను చైతన్యం చేసి పెద్ద ఎత్తున భూ పోరాటాలు నడిపి వేలాది ఎకరాల భూములు పంచిన చరిత్ర వారిది.ఇవ్వల్లా పేద వాడి దగ్గర భూములు వున్నవి అంటే ఎర్ర జండా నాయకత్వంలో సాగిన సాయూదా పోరాట పలితమే అని గుర్తు చేసుకోవాలి.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం జంగయ్య,గోపాల్,రాములు శ్రీరాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ మహిళా సమాఖ్య మరియు మహాజన మహిళా మండలి జిల్లా సదస్సును విజయవంతం చేయాలి



**నిజామాబాద్ , సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
ఈనెల 19 వ తేదీన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సందీప్ గార్డెన్స్ లో జరగనున్న "మాదిగ మహిళా సమాఖ్య" మరియు "మహాజన మహిళా మండలి" జిల్లా సదస్సును విజయవంతం చేయాలని మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుమ్మటు పద్మ మాదిగ తెలుపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న లింగవివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో నూతన ఉద్యమానికి మహిళలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా మహిళా సదస్సును నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లా సదస్సు అనంతరం మాదిగ మహిళా సమాఖ్య, మహాజన మహిళా మండలి నూతన జిల్లా కమిటిలను ఎన్నుకుంటామన్నారు. కావున జిల్లాలోని మాదిగ మహిళలు మరియు కుమతాలకతీతంగా మహాజన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జాతీయ పొలిట్ బ్యూరో నాయకురాళ్లు సత్తక్క, పెద్దొల్ల యమునక్ మాదిగ, కన్నూరు సుధ మాదిగ. మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి... బాన్స్వాడ నియోజకవర్గ ఇంచార్జి. పోచిరాం,కోటగిరి, పోతంగల్,మండల అధ్యక్షులు. పోశెట్టి,అశోక్,గ్రామ అధ్యక్షులు. లాలయ్య,కన్నం శ్రీనివాస్, ఎడ్ల సాయిలు, కృష్ణ,దినేష్, శ్రీకాంత్, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు...

# శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీకారం



**ఏన్కూరు, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
ఏన్కూరు మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయ నిర్మాణ పనులు బుధవారం శుభ ముహూర్తంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాలొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తుల "జైశ్రీరామ్ "నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.శ్రీ కోదండ రామాలయ నిర్మాణం పూర్తయితే ఏన్కూరు మండల ప్రజలతో పాటు పరిసర గ్రామాల భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలువనుంది. ఆలయ నిర్మాణం శుభప్రదంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇల్లందు మాజీ MLA గుమ్మడి నర్సయ్య, మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ను సన్మానించిన గడ్కోల్ వీడీసీ




**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
ప్రజల మనిషి, ఐదు సార్లు ఎమ్ ఎల్ ఏ గా గెలిచినా ఇల్లందు మాజీ ఎమ్ ఎల్ ఏ గుమ్మడి నర్సయ్యను, మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు గార్లను గడ్కోల్ వీడీసీ సభ్యులు మంగళవారం నాడు సన్మానించారుగడ్కోల్ గ్రమంలో రెండు రోజులుగా జరుగుతున్న సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులలో పాల్గొనడానికి వచ్చిన వీరిని సన్మానించారు★ ఈ సందర్భంగా ఇల్లందు మాజీ MLA గుమ్మడి నర్సయ్య మాట్లాడుతు: రైతంగాం నేడు తీవ్రమైన సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ప్రభుత్వాలు పాలకవర్గాలు రైతుల్ని పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్త చేశారు. వ్యవసాయ రంగం ఈరోజు దివానా తీసి పూర్తిగా సంక్షోభంలో కూలిపోయింది అన్నారు. సిరికొండ మండలం ముఖ్యంగా గడ్కోల్ లాంటి గ్రామాలు ఉద్యమాలకు ముఖ్య కేంద్రాలుగానే కాకుండా వ్యవసాయ రంగంలో విప్లవత్మకమైన కృషికి కేంద్ర బిందువుగా నిలిచాయన్నారు. గడ్కోల్ రైతంగాం రాష్ట్ర వ్యాపిత రైంగానికే కాకుండా వ్యవసాయ రంగానికే తలమాణికం అన్నారు. కార్యక్రమం లో సీపీఐ(ఎంఎల్ ) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు కె రమ, అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) కేంద్ర ప్రధాన కార్యదర్శి కే రంగయ్య, రాష్ట్ర అధ్యక్షులు V ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం చిన్న చంద్రన్న, తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణ, ఏఐపికెఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి రామకృష్ణ విడిసి చైర్మన్ కె సంతోష్ రెడ్డి, కోశాధికారి ఎం భూషణ్ రెడ్డి, సాయికుమార్ ధర్మన్న, కేపీ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ కి స్థలాన్ని కేటాయించగలరు : ఎర్రం లింగం


గ్రామ పంచాయితీ కార్యాలయము, నందిపేట్
GRAMA PANCHAYATH OFFICE, NANDIPET
M: Nandipet, Dist: Nizamabad-503212



**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
నందిపేట్ గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) ఫేజ్–2 కింద డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు రూ.40 లక్షలు మంజూరు కావడంతో, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా కి వినతిపత్రం అందజేశారు.తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా,నందిపేట్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా గ్రామంలో పారిశుధ్యం,పరిశుభ్రతకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎర్రం లింగం “Clearance of Land for Plastic Waste Management Unit (PWMU)” కోసం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనువైన స్థలాన్ని కేటాయించాలని సబ్ కలెక్టర్‌ను కోరారు.డంపింగ్ యార్డ్,ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ ఏర్పాటుతో నందిపేట్ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడి,పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది అని ఆయన అన్నారు.

# ఖరీఫ్ ధాన్యం సేకరణ,నిల్వ చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా
- అక్టోబర్ మొదటి వారం నుండే కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడి



**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఖరీఫ్ 2026-27 సీజన్ ధాన్యం సేక రణ కు, సేక రించిన ధాన్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో,తహసీల్దార్లతో కలెక్టర్ ఖరీఫ్ ధాన్యం సేకరణ అంశంపై సమీక్ష జరిపారు.ఈసారి జిల్లాలో 4.35 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారని,12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు.ఇందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించామని కలెక్టర్ సూచించారు.ఇందుకోసం జిల్లాలో ఈసారి అన్ని ప్రాంతాల్లో రైతులకు అందుబాటులో ఉండేలా 736 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.గత రబీలో 660 కేంద్రాలు కొనసాగగా,ఈసారి అదనంగా 76 కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.రాష్ట్రంలోనే మొట్టమొదటగా నిజామాబాద్ జిల్లాలో ధాన్యం దిగుబడులు చేతికి అందనున్న దృష్ట్యా,అక్టోబర్ మొదటి వారం నుండే రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి కొనుగోలు కేంద్రంలో తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు.గన్నీ బస్తాలు,తేమ కొలిచే యంత్రాలు,వేయింగ్ మెషీన్లు,టార్పాలిన్లు సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.తగిన సదుపాయాలు సమకూర్చుకుని ఆన్లైన్ లో వివరాలు అప్లోడ్ చేసిన తరువాతనే ట్యాబ్ అందుబాటులోకి వస్తుందని ఈ సర౦దర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.కాగా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఈసారి రైస్ మిల్లులకు పంపే అవకాశం లేనందున ధాన్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చేందుకు అవసరమైన గిడ్డంగులు,అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ గిడ్డంగులతో పాటు మార్కెట్ కమిటీ గోడౌన్ లు,ప్రైవేట్ గిడ్డంగులను ధాన్యం నిల్వ కోసం క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు.ఎక్కడ కూడా ధాన్యం నిల్వ చేసే విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు.అవసరమైన పక్షంలో ధాన్యం భద్రపర్చేందుకు వీలుగా మూతపడిన రైస్ మిల్లులు,పరిశ్రమలతో పాటు ఫంక్షన్ హాళ్లు,అనువైన ఖాళీ స్థలాలను కూడా గుర్తించాలని తహసీల్దార్లకు సూచించారు.సంబంధిత శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పని చేస్తూ,ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు.సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,డీఆర్ఓ గీత,ఆర్డీఓలు రాజేంద్ర కుమార్,విజయ కుమారి,డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్,డీసీఓ శ్రీనివాస్ రావు,సంబంధిత శాఖల అధికారులు,అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తితో కేశంపేటలో సందడి.. ఘనంగా క్రీడా పోటీలు ప్రారంభం





**కేశంపేట, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** కేశంపేట మండల కేంద్రంలోని ఎడుకోజ్ అకాడమీ పాఠశాల ప్రాంగణంలో 70వ పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో కేశంపేట మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటేందుకు ఉత్సాహంగా మైదానంలోకి అడుగుపెట్టారు.కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఎం. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిచంద్ర కుమార్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. వారు జ్యోతీ ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి, అనుజ్ గురువర, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఎడుకోజ్ అకాడమీ ఆధ్వర్యంలో పోటీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభకు ఈ పోటీలు మంచి వేదికగా నిలిచాయి.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా హార్థిక భరోసా

**- తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**తలకొండపల్లి , సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం వేల్జాల్ గ్రామంలో బాధిత కుటుంబానికి పరామర్శించి, మృతుని చిత్రపటాని పూలమాల వేసి నివాళులర్పించి కుటుబా సభ్యులకు ఆర్థిక సహాయంఅందజేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్త కూరాకుల(ఎరుకలి) ఆంజనేయులు(అంజి) తమ్ముడు కూరాకుల రాఘవేందర్ ఇటీవల వినాయక మండపం పనులు చేస్తూ శని వారం ప్రమాదవశాత్తు మృతి చెందినడు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ ఆర్థిక సహాయం అందించినవారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి 4000 వేల రూపాయలు, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి 4000 వేల రూపాయలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి 2000 వేల రూపాయలు, మాజీ ఎంపీటీసీ లు జి శ్రీనివాసమూర్తి 1000 రూపాయలు, మాజీ ఎంపీటీసీ ఎం.ఆంబాజీ 2000 , మాజీ ఉప సర్పంచ్ అజీజ్ 3000వేల రూపాయలు,పి. అశోక్ బాబు 1000 రూపాయలు, మాజీ ఉప సర్పంచ్ బి.నర్సింలు 1000 రూపాయలు, ఏ అంజయ్య గౌడ్ 1000 రూపాయలు,మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అరీఫ్ 1000 రూపాయలు , వద్దే రాజు 1000రూపాయలు, ఏ.వెంకట్ రెడ్డి 1000 రూపాయలు తిరుమణి కృష్ణయ్య గౌడ్ 1000 రూపాయలు, పుల్లల విష్ణు 1000 రూపాయలు వద్దే రాము 1000 రూపాయలు దుబ్బ నరేష్ 500 రూపాయలు మొత్తం రూపాయలు 25,500 వేయిల రూపాయలు కుటుంబ సభ్యులకు ఆర్థికంగా సహాయం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని,ప్రజల కష్టాల్లో భాగస్వామిగా ఉంటామని గ్రామ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎం అంబాజీ,మాజి ఉప సర్పంచ్ అజీజ్ మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ టి.కృష్ణయ్య గౌడ్,నాయకులు ఎండి యూసుఫ్,వద్దే రాజు,పుల్లాల విష్ణు ,దుబ్బ నరేష్, సయిద్, వద్దే రామ్, చీపురి దర్శన్ ,గోపాల్,వట్టల మల్లేష్, మిడత రమేష్, చింతకాయల శివ,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొనగలరు

# ఆరు దశాబ్దాల ప్రజాసేవకు అద్దం 'ఓ కర్మయోగి జీవితం'





**శామీర్‌పేట, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ప్రజాసేవలో ఆరు దశాబ్దాల అనుభవం, పరిపాలనా రంగంలో ఎదురైన సవాళ్లు, విజయాలు, నాయకత్వ పాఠాలను ప్రతిబింబించే 'ఓ కర్మయోగి జీవితం – ప్రభుత్వ ఉద్యోగి ఆత్మకథ' పుస్తకాన్ని బుధవారం శామీర్‌పేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. సంస్థ మాజీ సంచాలకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ముద్దుసెట్టి గోపాలకృష్ణ నాయుడు రచించిన ఈ ఆత్మకథను ముఖ్య అతిథుల సమక్షంలో ఆవిష్కరించారు.సంస్థ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించిన కార్యక్రమానికి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులతో పాటు పలువురు ప్రస్తుత, విశ్రాంత ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ నాయుడును ఘనంగా సన్మానించి, ఆయన సుదీర్ఘ ప్రజాసేవ అనుభవాలను ప్రేక్షకులతో పంచుకునేలా ముఖాముఖి నిర్వహించారు.

**21 ఏళ్లకే ప్రభుత్వ సేవలోకి..**

ముద్దుసెట్టి గోపాలకృష్ణ నాయుడు 1960లో 21 ఏళ్ల వయసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సర్వీసులో చేరారు. అనంతరం 1962లో తొలిసారిగా ఐఏఎస్ పరీక్షకు హాజరై ఉత్తీర్ణులయ్యారు. ఐఏఎస్ శిక్షణలో న్యాయశాస్త్ర పరీక్షలో వంద శాతం మార్కులు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అసోం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వంలో వివిధ కీలక బాధ్యతలను నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలుదీర్ఘకాలం ప్రభుత్వ పరిపాలనలో పనిచేసిన గోపాలకృష్ణ నాయుడు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి హోదాలో గ్రామీణ విద్యుదీకరణ సంస్థ చైర్మన్‌గా పదవీ విరమణ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన 246 సంస్థలకు ప్రాతినిధ్యం వహించే అత్యున్నత సంస్థ స్కోప్‌కు చైర్మన్‌గా కూడా సేవలందించారు. గోదావరి ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి, పరిశ్రమను నిర్ణీత గడువు కంటే ముందుగానే, అంచనా వ్యయ పరిమితుల్లోనే ప్రారంభించడంలో కీలకపాత్ర పోషించారు.

**యువతకు మార్గదర్శకంగా ఆత్మకథ**

ప్రభుత్వ పరిపాలనలో ఎదురయ్యే సవాళ్లు, ప్రజా సంస్థల నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, నాయకత్వ అనుభవాలు, ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ వంటి విలువలను ఈ పుస్తకంలో వివరించినట్లు నిర్వాహకులు తెలిపారు. సివిల్ సర్వీసుల్లో పనిచేస్తున్న అధికారులు, సివిల్ సర్వీసులకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, ప్రజా పరిపాలన–నిర్వహణ విద్యార్థులకు ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ పుస్తకం 'లైఫ్ ఆఫ్ ఎ కర్మ యోగి – మెమోయిర్ ఆఫ్ ఎ సివిల్ సర్వెంట్' పేరుతో ఆంగ్లంలోనూ అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పుస్తక రచయితతో పాల్గొన్నవారు సంభాషిస్తూ ఆయన సుదీర్ఘ ప్రజాసేవ అనుభవాలు, పరిపాలనా రంగంలో ఎదురైన పరిస్థితులు, సంస్థల అభివృద్ధిలో చేపట్టిన చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ నాయుడు తన అనుభవాలను వివరించారు.

# టీపీసీసీ చీఫ్ గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఈరవాత్రి,మానాల



**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** బాల్కొండ నియోజకవర్గంలో భీంగల్ పట్టణ కేంద్రంలో టీపీసీసీ చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్ దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ నాయకులు మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్,మాజీ డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి లు కేక్ కటింగ్ చేసి మహేష్ కుమార్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భీంగల్ పట్టణ అధ్యక్షుడు పరస అనంతరావు మాజీ మండల అధ్యక్షుడు బోదిరె స్వామి మాజీ పట్టణ అధ్యక్షులు జై జై నరసయ్య మాజీ ఎంపీపీ కన్న సురేందర్ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరేపల్లి నాగేంద్రబాబు బాల్కొండ మండలం మాజీ అధ్యక్షులు గున్నల వెంకటేష్ గౌడ్ బంగ్లా దేవేందర్ సుంకరి సురేష్ గట్టు మురారి మేకల శీను అనిల్ గౌడ్ పతాని జేమ్స్ నరేందర్ శీను రవి రాజేశ్వర్ కల్పన గంగమణి ఎంకమ్మ బాల్కొండ మండల నాయకులు ఎర్గట్ల మండల నాయకులు వేల్పూర్ మండలం నాయకులు వివిధ గ్రామ సర్పంచ్లు ఉప సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

# కళా భారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ స్థలంలో నిర్మిస్తున్నకళా భారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు.బుధవారం ఆయన ఆడిటోరియం పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.సాంస్కృతిక కార్యక్రమాలు,వివిధ వేడుకల కోసం అధునాతన సదుపాయాలతో గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదు అంతస్తులతో నిర్మిస్తున్న భవన సముదాయం పనుల వివరాల గురించి ఆర్ అండ్ బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.వేదిక,రెండు బ్యాంకెట్ హాల్స్,సుమారు 1400 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియం,ఆర్ట్ గ్యాలరీ పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.ఇప్పటికే ఫ్రేమ్ వర్క్ పూర్తయినందున మిగతా పనులను కూడా వేగవంతంగా జరిపించాలని కలెక్టర్ సూచించారు.సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలో సరైన వేదికలు లేనందున కళాభారతి ఆడిటోరియం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,నాణ్యతతో జరిగేలా చూడాలన్నారు.పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సూచించారు.





**ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అనువైన స్థలాల పరిశీలన**

అన్ని హంగులతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్,వసతి గృహ సముదాయాల నిర్మాణాల కోసం ఎంపిక చేసిన స్థలాలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం పరిశీలించారు.గుండారం గ్రామంతో పాటు,నాగారం నందిగుట్ట ప్రాంతాల్లోని స్థలాలను కలెక్టర్ పరిశీలించారు.సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజేంద్ర కుమార్,ఆర్ అండ్ బీ ఈ.ఈ ప్రవీణ్,రెవెన్యూ శాఖ,ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి

## -ముఖ్యమంత్రి మాట ఇచ్చిన 10000 వేతనం ఇవ్వాలి

- **MDM రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి.**

**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దీక్షను ఏర్పాటు చేయడమైనది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించలని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వంట కార్మికుల ప్రధాన డిమాండ్లు:

1) జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న జూన్,జూలై,ఆగస్టు నెలల బిల్లులను వెంటనే విడుదల చేయాలి.
2) ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించే అల్పాహార పథకాన్ని మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించాలి.
3) సెంట్రలైజ్ కిచెన్ విధానం పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదు.
4) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంట కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.
5) కోడి గుడ్లు,గ్యాస్ నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి.
6) వంట కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలి.గతంలో అల్పాహారం అందించినందుకు సంబంధించిన బిల్లులు,పారితోషిక బకాయిలను వెంటనే చెల్లించాలి.
7) వంట కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలి.
8) రాజకీయ కక్షలతో గానీ,ఇతర కారణాలతో గానీ వంట కార్మికులను విధుల నుంచి తొలగించరాదు.
9) ప్రతి విద్యార్థికి మెస్ చార్జీగా రూ.25 చెల్లించాలి.




ఈ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తోపునూరు చక్రపాణి డిమాండ్ చేశారు.వంట కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.ఈ దీక్ష సమావేశంలో పాల్గొన్న మండల బాధ్యులు జిల్లా ఏఐటీయూసీ కోశాధికారి ఫిరోజ్ అలీ,సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్,అధ్యక్షురాలు బైరి సాయమ్మ,అధ్యక్షురాలు నాగలక్ష్మి నరేష్ కవిత బాబాయమ్మ లక్ష్మీ పోసాని కార్మికులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రుల్లో భక్తులు ఈ జాగ్రత్తలు తప్పక పాటించాలి

## -వెల్జాల్ గ్రామ సర్పంచ్ వానరాసి రాములమ్మ పిలుపు

**తలకొండపల్లి, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులందరూ సురక్షితంగా, సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ సర్పంచ్ వానరాసి రాములమ్మ తనయుడు వనరాశి వెంకటేష్ పిలుపునిచ్చారు.గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని కోరుతూ, ఉత్సవాల నిర్వహణలో మండపాల నిర్వాహకులు, ప్రజలు తీసుకోవలసిన పలు ముఖ్యమైన జాగ్రత్తలను ఆమె ఒక ప్రకటనలో విడుదల చేశారు.పండగ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులు కింది సూచనలు పాటించాలని కోరారు.విగ్రహ ప్రతిష్ఠాపన: వినాయక విగ్రహాల ప్రతిష్ఠకు ముందుగా అత్యంత పరిశుభ్రమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలి. విగ్రహాన్ని నిర్దేశిత నియామకాలకు అనుగుణంగా, పూర్తి జాగ్రత్తలతో ప్రతిష్ఠించాల్సి ఉంటుంది.పటాకుల విషయంలో అప్రమత్తత: వేడుకల సమయంలో పటాకులు కాల్చేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి.ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.ఆహారం, నీటి పరిశుభ్రత: పండగ రోజుల్లో పూర్తి శుభ్రంగా ఉన్న ఆహారాన్ని మాత్రమే భుజించాలి. కలుషితమైన నీటిని తాగకుండా జాగ్రత్త పడాలి.జనసమ్మర్ద ప్రదేశాల్లో జాగ్రత్త: రద్దీగా ఉండే ప్రాంతాల్లో మరియు గుంపుల్లో తోపులాటలు జరగకుండా చూసుకోవాలి.ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి.విద్యుత్ భద్రత: మండపాల వద్ద వైర్లు, లైట్లు, మరియు విద్యుత్ అలంకరణల విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా నిపుణులతో తనిఖీ చేయించుకోవాలి.వ్యాధుల పట్ల అప్రమత్తత:ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాస్కులు ధరించడం, పరిశుభ్రత పాటించడం చేయాలి. జ్వరం, దగ్గు, శ్వాసకోశ ఇబ్బందులు ఉన్నవారు జనసందోహానికి దూరంగా ఉండటం శ్రేయస్కరం.పర్యావరణ పరిరక్షణ: పండగ వేడుకల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి.పర్యావరణహిత వస్తువులను మాత్రమే వినియోగించాలి. నదులు, చెరువులను కలుషితం చేయకూడదు.నిమజ్జనం సమయంలో..: వినాయక నిమజ్జనం ప్రక్రియను పూర్తిగా అధికారుల సూచనల మేరకు మాత్రమే నిర్వహించాలి. జల వనరులు కలుషితం కాకుండా బాధ్యతగా వ్యవహరించాలి."సురక్షితమైన వేడుకలు... సంతోషమైన వినాయక చవితి" నినాదంతో సాగే ఈ ఉత్సవాల విజయవంతానికి గ్రామ ప్రజల, భక్తుల సహకారం ఎంతో అవసరమని సర్పంచ్ వానరాసి రాములమ్మ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# హెచ్ ఎన్ఎస్ లుక్స్' ఎయిర్ & స్కిన్ లాంజ్ బుధవారం నాడు ఘనంగా ప్రారంభం.





**ఉప్పల్ భగాయత్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
ఉప్పల్ భగాయత్ పరిధిలో సరికొత్తగా ఏర్పాటు చేసిన ' హెచ్ఎ న్ఎ స్ లుక్స్' హెయిర్ & స్కిన్ లాంజ్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ అనీ మాస్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి లాంజ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి నిర్వాహకులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి అనీ మాస్టర్ మాట్లాడుతూ, ఉప్పల్ భగాయత్ పరిసర ప్రాంత ప్రజలకు అంతర్జాతీయ స్థాయి సౌందర్య సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో కేశాలంకరణ, చర్మ సంరక్షణ ప్రతి ఒక్కరికీ దైనందిన జీవితంలో భాగమైపోయాయని, మహిళా పారిశ్రామికవేత్తలుగా సరికొత్త అడుగులు వేస్తున్న నిర్వాహకులు హారిక మరియు శిరీషలకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.అధునాతన పరికరాలు, సుశిక్షితులైన సిబ్బందితో ఏర్పాటైన ఈ హెచ్ఎన్ఎస్ లక్స్ లాంజ్ ప్రజల ఆదరాభిమానాలను చూరగొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు హారిక, శిరీషలు మాట్లాడుతూ, మహిళలతో పాటు పురుషులకు కూడా తల వెంట్రుకల నుంచి పాదాల వరకు అవసరమైన అన్ని రకాల హెయిర్, స్కిన్, బ్యూటీ, నెయిల్స్ మరియు లగ్జరీ ట్రీట్మెంట్స్ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నాణ్యమైన అంతర్జాతీయ బ్రాండెడ్ ఉత్పత్తులను మాత్రమే వినియోగిస్తున్నామని, దాదాపు 20 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన నిపుణులైన సిబ్బందితో అత్యుత్తమ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇతర క్లినిక్‌లతో పోలిస్తే సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే రీజనబుల్ ధరలకే సేవలందిస్తున్నామని, ప్రారంభోత్సవం సందర్భంగా కేవలం రూ. 499/- నుంచే కాంబో ప్యాకేజీలు, అలాగే రూ. 2,000/- నుంచే అడ్వాన్స్‌డ్ స్కిన్ ట్రీట్మెంట్స్ ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఈ లాంజ్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సేవల కొరకు 9381699033 నంబర్‌ను సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక మహిళలు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆకలి తీర్చడమే అసలైన దైవ సేవ : వేములపల్లి కృష్ణారావు ఉదారత



**అశ్వాపురం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వినాయక చవితి అంటే భక్తి మాత్రమే కాదు.. ఆకలితో ఉన్నవాడి కడుపు నింపడమే నిజమైన దైవసేవ అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తున్నారు వేములపల్లి కృష్ణార్జునరావు అశ్వాపురంలోని ఎస్సీ కాలనీలో గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలకు చేదోడువాదోడుగా నిలుస్తూ, పలుమార్లు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ కాలనీ ప్రజల అభిమానం, మన్ననలు పొందుతున్నారు. 2026లో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పూర్తిస్థాయి అన్నదాన కార్యక్రమాన్ని కృష్ణార్జునరావు గారే చేపట్టడం విశేషం.అన్నదానం అంటే ఆకలి తీర్చడమే కాదు ఆప్యాయతను పంచడం. దేవుడికి పూజ చేసే చేతులతోనే మనిషికి అన్నం పెట్టినప్పుడే ఆ భక్తికి పరిపూర్ణత" అనే భావనతో ఆయన చేస్తున్న సేవను కాలనీ యువకులు అభినందిస్తున్నారు.ఈ సందర్భంగా వినాయక విగ్రహ దాతలుగా సహకరిస్తున్న రాపల్లి ప్రవీణ్, హన్సిక దంపతులులకు కాలనీ యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కులం, వర్గం అనే భేదాలు లేకుండా భక్తిని మానవత్వంతో ముడిపెట్టి.. ఆకలిగొన్నవారికీ అన్నం పెట్టే సేవే నిజమైన గణనాథుని సేవ అని కృష్ణార్జునరావు అన్నదానం మరోసారి చాటిచెబుతోంది.

# గణేష్ లడ్డూ వేలంలో రూ.41,111కు ప్రసాదం దక్కించుకున్న అర్ద సుధాకర్‌రెడ్డి



**వికారాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వికారాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన గణేష్ లడ్డూ ప్రసాదం వేలంపాటలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టీజేఎంయూ గౌరవ అధ్యక్షులు అర్ద సుధాకర్‌రెడ్డి రూ.41,111లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. గణనాథునిపై భక్తి, విశ్వాసంతో వేలంపాటలో పాల్గొని లడ్డూను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు "జై బోలో గణేష్ మహారాజ్ కీ జై" అంటూ నినాదాలు చేశారు.

# వైద్య సిబ్బందికి పాలన అంశాలపై శిక్షణ



**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని వైద్య సిబ్బంది,పిహెచ్సి మినిస్ట్రియల్ సిబ్బందికి డ్రాఫ్టింగ్,పాలన పరమైన అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ తెలియజేశారు.వైద్య సిబ్బంది పాలనా పరమైన అంశాల్లో,డ్రాఫ్టింగ్,ప్రొసీడింగ్స్,లెటర్ రైటింగ్,లీవ్స్ రూల్స్,ఆఫీస్ సభార్డినేట్ రూల్స్,మెమో,షో కాజ్ నోటీసు ఇవ్వడం,ఆర్ టి ఐ కేసెస్,కోర్టు కేసెస్ డీల్ చేయడం మొదలగు అన్ని అంశాలపై రిటైర్డ్ కార్మిక అధికారి యోహాన్ శిక్షణ ఇవ్వడం జరిగింది.కాబట్టి ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అడిగిన సందేహాలకు జవాబులు ఇవ్వడం జరిగింది.ఇంకా ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ ఏవో సుమంత్ కుమార్,ఎస్ఓ రాజేశ్వర్ సూపరిండెంట్లు వినయ్ కుమార్,షకీల్,వెంకటేశ్వర్లు,సందీప్ కార్యాలయ సిబ్బంది వివిధ పిహెచ్సి ల మినిస్టిరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవలను గుర్తించి ఉపాధ్యాయులకు సత్కారం

- **విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం మండల విద్యాధికారి- పగిడిపాటి నరసింహ**



**డిండి (గుండ్లపల్లి), సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిండి (గుండ్లపల్లి) మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.మండలంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించి, వారి సేవలకు గుర్తింపుగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా బ్రహ్మచారి, జీహెచ్ఎం నారాయణరెడ్డి, టీజీ ఎంఎస్ ప్రిన్సిపల్, సరోజ, దివ్యశ్రీ, కవిత, ఈశ్వరమ్మ, విజయలక్ష్మి , ఆవుల మధు, సంతోషి, వరలక్ష్మి , సుజాత, వెంకటేష్, కృష్ణవేణి, రాము నాయక్‌లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పగిడిపాటి నర్సింహ, ఎంపీవో జంగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గీతాంజలి, శ్రీను, మండలంలోని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సత్కరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రశాంత్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

- **బూడిద నందారెడ్డి - ప్రభావతి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ**
- **దాదాపు 2,000 మందికి పైగా భక్తుల హాజరు**





**వనస్థలిపురం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రశాంత్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమానికి బీఎన్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్, తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ స్టేట్ క్రషర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బూడిద నందా రెడ్డి – ప్రభావతి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు అన్నదాన దాతలుగా వ్యవహరించారు.ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం నందా రెడ్డి కుటుంబ సమేతంగా భక్తులకు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన దాదాపు 2,000 మందికి పైగా భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బూడిద నందా రెడ్డి మాట్లాడుతూ — "విఘ్నాలను తొలగించి సకల శుభాలను చేకూర్చే వినాయకుడి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నదే మా ఆకాంక్ష. 'అన్నదానం మహాదానం'.. ఆకలి తీర్చడంలో ఉండే తృప్తి మరెందులోనూ లభించదు. భగవంతుని సేవతో పాటు మానవ సేవలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఇలాంటి పుణ్యకార్యాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి. ఇంతటి పవిత్రమైన కార్యక్రమాన్ని క్రమశిక్షణతో, నిబద్ధతతో విజయవంతంగా నిర్వహించిన ప్రశాంత్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను, స్థానిక యువతను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, కాలనీవాసులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# అభివృద్ధికి అలియాబాద్ కౌన్సిల్ పెద్దపీట

- **రూ.1.38 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం.. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులపై కీలక నిర్ణయాలు**






**శామీర్ పేట, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అలియాబాద్ పురపాలక సంఘాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్ సమష్టిగా కృషి చేయాలని పురపాలక సంఘ చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.అలియాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించి, సుమారు రూ.1.38 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వార్డుల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై కౌన్సిలర్లు చర్చించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పురపాలక సంఘ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు.కౌన్సిల్ సమావేశంలో పారిశుద్ధ్య నిర్వహణ, భూగర్భ మురుగునీటి కాలువల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, అంతర్గత రహదారుల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, పార్కులు, హరిత ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఆయా పనులకు సంబంధించిన పరిపాలనాపరమైన అనుమతులు, అభివృద్ధి చర్యలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు పురపాలక సంఘం తరపున చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డుల వారీగా ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కౌన్సిల్ ఆమోదించిన అభివృద్ధి పనులను నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాలు తదితర పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.సమావేశంలో కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై చర్చించిన కౌన్సిల్ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు పలు నిర్ణయాలు తీసుకుంది. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్ నగర్‌లో ఘనంగా బాల గణపతి నవరాత్రి ఉత్సవాలు



**గజ్వేల్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు భారత్ నగర్‌లో "గరుడ యూత్" ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి. గరుడ యూత్ సభ్యులు, కాలనీలో చిన్నారులు ఎంతో ఉత్సాహంతో, వైవిధ్యభరితంగా గణపతి మండపాన్ని అలంకరించి 'బాల గణపతి' విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బుధవారం నాటి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి చిన్నారులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులైన చిన్నారులు మాట్లాడుతూ కాలనీవాసులు, భక్తులందరూ బాల గణపతిని దర్శించుకుని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం గణేశుని మహా ప్రసాదమైన లడ్డూ కోసం రూ. 25 లకే ఒక టోకెన్ అందజేస్తున్నామని చిన్నారులు వెల్లడించారు. భక్తులందరూ విశేష సంఖ్యలో విచ్చేసి, స్వామి వారిని దర్శించుకోవడం తో పాటు లడ్డు టోకెన్లు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గరుడ యూత్ సభ్యులు, స్థానిక చిన్నారులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# గ్రామాల స్వచ్ఛతే లక్ష్యం: ఎంపీడీవో సంకీర్త్

- **పినపాక మండలంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం**



**పినపాక, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
పినపాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు పినపాక మండలంలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు "స్వచ్ఛత మేన్ సహభాగ్ – స్వచ్ఛ భారత్, వికసిత భారత్" నినాదంతో 'స్వచ్ఛత హీ సేవ–2026' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) తెలిపారు. ఈ మేరకు మండలంలోని పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు సమగ్ర కార్యాచరణ ఆదేశాలు జారీ చేశారు.ప్రజా భాగస్వామ్యంతో ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త బ్లాక్ స్పాట్లను ( సి టి యు ) గుర్తించి శాశ్వతంగా శుభ్రపరచడం, ఇంటింటా వ్యర్థాల వర్గీకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిరోధంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ముఖ్య కార్యక్రమాలు:సెప్టెంబర్ 17 నుండి24 వరకు పాఠశాలల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, గ్రామాల్లో శ్రమదానం, మార్కెట్లు, బస్టాండ్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల శుభ్రత, ఇంటింటా గుడ్డ సంచుల పంపిణీ.సెప్టెంబర్ 25 నుండి27 వరకు వినాయక నిమజ్జన ఘాట్ల పరిశుభ్రత, పూల వ్యర్థాల కంపోస్టింగ్, ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక ప్రాంతాల శుభ్రత.సెప్టెంబర్ 28 నుండి 30 వరకు 'వేస్ట్ టు వేల్త్' పోటీలు, పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం సన్మానం.అక్టోబర్ 1 నుండి 2: అక్టోబర్ 1న ఉదయం 8 గంటలకు "ఒక రోజు–ఒక గంట–ఒకేసారి" మహా శ్రమదానం, 2న ప్రత్యేక గ్రామసభ నిర్వహించి స్వచ్ఛత తీర్మానం, మొక్కలు నాటే కార్యక్రమం.గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా సర్పంచులు ప్రజలను, మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు రోజువారీ నివేదికలను మండల కార్యాలయానికి సమర్పించాలని ఎంపీడీఓ సంకీర్త్ ఆదేశించారు.

# అంబేద్కర్ రక్షణ చట్టం కోసం పార్లమెంట్‌లో చర్చించాలి





**హన్మకొండ, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తు న్న హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన ప్రతిపాదించిన పుస్తక ఆవిష్కరణను నిలిపివేయాలని డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకు లు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్మాదాసి సురేష్ కోరారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు.అంబేద్కర్‌ను అవమానిం చే వ్యాఖ్యలు, విగ్రహాల ధ్వంసం వంటి ఘటనలను అరికట్టేందుకు అంబేద్కర్ రక్షణ చట్టం తీసుకురావ డానికి పార్లమెంట్‌లో బిల్లు కోసం చర్చించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ అంశా న్ని ముఖ్యమంత్రి, డీజీపీ దృష్టికి తీసుకెళ్లి శాంతిభద్ర తలకు విఘాతం కలగకుం డా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిరాజ్ యాదవ్, కేడల ప్రసాద్, అంకూస్ రవికుమార్, మైదం జయపాల్, స్వామి తదితరులు పాల్గొ న్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలిసీడీఎంఏ





**హనుమకొండ, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాజెక్టు డీపీఆర్, టెండర్ ప్రక్రియపై అధికారు లతో సమీక్షించారు. 15 రోజుల్లోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారం భించేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. హనుమకొండ కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి, కమిషనర్ టి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఎంఈఓ వెంకట్రాములు తనిఖీలు

- **విద్యార్థుల హాజరు, బోధన, పాఠశాల నిర్వహణపై పరిశీలన**



**మిడ్జిల్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
మిడ్జిల్: మండలంలోని దోనూర్, కంచనపల్లి, మసిగుండ్లపల్లి, రాణిపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ వెంకట్రాములు బుధవారం సందర్శించారు. పాఠశాలల్లో విద్యా బోధనతో పాటు విద్యార్థుల హాజరు, పాఠశాల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన ఎంఈఓ విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న బోధనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థులలో చదువుపై ఆసక్తినీ పెంచేలా బోధనా పద్ధతులను అమలు చేయాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహకారం అందించాలని ఎంఈఓ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.అదేవిధంగా పాఠశాలల నిర్వహణ, తరగతి గదుల పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై కూడా ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పర్యటనలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెంకటయ్యతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కాళికామాత ఆలయంలో,గోల్డ్ ఫేస్ కాలనీలో కొలువైన గణనాథుడు

- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**





**షాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వినాయక చవితి సందర్భంగా షాబాద్ మండలంలోని లక్ష్మీ దేవి(కాళికామాత) ఆలయంలో,గోల్డ్ ఫేస్ కాలనీలో గణనాథుడు కొలువుదీరాడు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య గణపతికి పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి పుష్పాలు, పత్రి, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు,అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

# నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

- **అధికారులను ఆదేశించిన చైర్మన్ జాము రవి**



**శామీర్ పేట, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ జాము రవి అధికారులను ఆదేశించారు. మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వినాయక మండపాల అధ్యక్షులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ జాము రవి అధ్యక్షతన, కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు.ఉద్దేమరి, కొల్తూర్, లక్ష్మాపూర్ ప్రాంతాల్లో నిమజ్జన మార్గాలు, పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి చైర్మన్ పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని చైర్మన్ కోరారు. మండపాల అధ్యక్షులు తమ ప్రాంతాల్లోని సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.సమావేశంలో షామీర్‌పేట్ ఎస్‌హెచ్‌ఓ నరసింహారెడ్డి, జీనోమ్ వ్యాలీ ఎస్‌హెచ్‌ఓ గురువయ్య, కౌన్సిలర్ ర్యాకల నీరజ్ గౌడ్, గిరిపల్లి రమేష్, మెరుపాటి గోవర్ధన్‌రెడ్డి, బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బసవరెడ్డి, మున్సిపల్ రెవెన్యూ అధికారి అరద్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్



**నాగోల్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** హైదరాబాద్ నాగోల్‌లోని కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యేందుకు యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో కార్మికులు బుధవారం చలో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలిచి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ జి. ప్రభాకర్, అదనపు కార్యదర్శి జంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏపీ రెడ్డి, రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్, ముఖ్య సలహాదారు రాజిరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ అనంతల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ నగేష్, సెక్రటరీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.

- **జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం.**
- **మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్**



**ఏన్కూర్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో జరుగుతున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం కోరారు.బుధవారం ఏన్కూర్ ప్రజా సంఘాల కార్యాలయం వద్ద తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .....గిరిజనుల హక్కులు, భూమి, అటవీ హక్కులు, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ గిరిజన సంఘం నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్ర మహాసభల్లో గిరిజనుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ మహాసభలకు ప్రజల మద్దతు అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కట్రం గంగరాజు, వాంకుడోత్ హతిరామ్ నాయక్, గొర్రె మేకల పెంపకదారుల సంఘం జిల్లా నాయకులు దొంతబోయిన నాగేశ్వర రావు, సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇటికల లెనిన్, ఎట్టి మనీష్, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్





**మంథని, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** మంథని నియోజకవర్గం మల్హర్ మండలం కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పీవీ నగర్‌లో పీవీ నగర్ గణేష్ యూత్ వింగ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొన్నారు.విగ్రహ దాత మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్,భిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంభం శ్యామల–సమ్మిరెడ్డి దంపతుల ఆహ్వానం మేరకు ఉత్సవ కార్యక్రమానికి హాజరైన పుట్ట మధూకర్ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.అనంతరం పీవీ నగర్ గణేష్ యూత్ వింగ్స్ సభ్యులు, నిర్వాహకులు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. గణనాథుని కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# పెద్ద చెరువులో నిమజ్జన ఏర్పాట్లు అంతంతే

- **పటిష్టంగా లేని బారికేడ్లు.. భక్తుల భద్రతపై ఆందోళన**





**శామీర్‌పేట, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వినాయక నిమజ్జనాలకు ప్రసిద్ధి చెందిన శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు కొనసాగుతున్నప్పటికీ భక్తుల భద్రతకు సంబంధించి పలు లోపాలు కనిపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు పటిష్టంగా లేకపోవడం, వాటి ఎత్తు తక్కువగా ఉండటంతో నిమజ్జన సమయంలో భక్తుల రద్దీ పెరిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.వినాయక నిమజ్జనాల కోసం చెరువు వద్ద రెండు భారీ క్రేన్లను ఏర్పాటు చేసారు . అయితే క్రేన్లకు అవతలి వైపు బారికేడ్లు లేకపోవడం, కొన్ని ప్రాంతాలు పూర్తిగా తెరిచి ఉండటంతో భక్తులు ప్రమాదవశాత్తు చెరువులోకి జారిపడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. నిమజ్జనం సమయంలో భారీ విగ్రహాలతో వచ్చే వాహనాలు, భక్తుల రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**తక్కువ ఎత్తు బారికేడ్లతో ముప్పు**

చెరువు పరిసరాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు కొన్ని చోట్ల వాటి పటిష్టతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగితే బారికేడ్లు ఒరిగిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చెరువు వైపు ఎవరూ వెళ్లకుండా తగిన ఎత్తుతో బలమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**కంకర తేలిన రహదారులు**

నిమజ్జనాల కోసం చెరువు ప్రాంగణంలో రహదారులు ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కంకర తేలి ఉండటంతో భక్తులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. నిమజ్జన విగ్రహాలతో వచ్చే వాహనాలు, భక్తుల రాకపోకలు పెరిగే సమయంలో రహదారులను సరిచేసి ప్రమాదాలకు తావులేకుండా చూడాలని కోరుతున్నారు.

**వెలుగులు ఉన్నా.. భద్రతపై దృష్టి అవసరం**

చెరువు ప్రాంగణంలో విద్యుత్ దీపాలు, ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేయడంతో రాత్రివేళ చీకటి లేకుండా చర్యలు చేపట్టారు. అయితే వెలుగులతో పాటు చెరువు అంచుల వద్ద భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని భక్తులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా క్రేన్ల చుట్టుపక్కల పూర్తిస్థాయిలో బారికేడ్లు ఏర్పాటు చేసి, చెరువు వైపు వెళ్లే మార్గాలను నియంత్రించాలని కోరుతున్నారు.

**భారీగా భక్తుల రాక**

శామీర్‌పేట పెద్ద చెరువులో వినాయక నిమజ్జనాలు ఉత్సవాల మూడో రోజు నుంచే ప్రారంభమవుతుంటాయి. ఐదో, ఏడో, తొమ్మిదో రోజుల్లోనూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేస్తుంటారు. చివరి రోజు నగరవ్యాప్తంగా జరిగే నిమజ్జనాల సందర్భంగా శామీర్‌పేట పెద్ద చెరువుకు భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే చెరువు వద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయాలని భక్తులు కోరుతున్నారు.

# పీజేఆర్ స్టేడియంలో ఘనంగా నాలుగు రోజుల క్రీడా సమావేశం ప్రారంభం..



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** పీజేఆర్ స్టేడియంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా సమావేశం తొలి రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకులు, అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు హాజరై క్రీడాకారులు, పి ఈ టి ఉపాధ్యాయులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా క్రీడా కార్యక్రమాల్లో పాల్గొంటున్న 60 మంది పి ఈ టి ఉపాధ్యాయులకు టీ షర్ట్లు, క్యాప్స్‌ను అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్రభు అందజేశారు. క్రీడా రంగానికి సేవలందిస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ, క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.అనంతరం రామప్రభు మైదానంలో టాస్ వేసి క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. క్రీడాకారులతో ముచ్చటించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ గవర్నమెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ యూసఫ్ ఖాన్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ నిర్మల, శేరిలింగంపల్లి పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎ ఆర్ పి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.నాలుగు రోజుల పాటు జరిగే ఈ క్రీడా సమావేశం ద్వారా విద్యార్థులు, క్రీడాకారుల్లో పోటీతత్వం, క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ మరింత పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.

# షాబాద్‌లో వినాయకునికి ప్రత్యేక పూజలు



**షాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని షాబాద్‌లో భక్తిశ్రద్ధలతో బడా గణేష్ దగ్గర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని 11 రోజులు విజయవంతం చేయడంలో యువజన సంఘం సభ్యులు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో కమ్మరి శ్రీను, మధు గౌడ్,కృష్ణ ,మల్లేశ్ యాదవ్, రామకృష్ణ యాదవ్.మహేందర్ గౌడ్, ధర్పల్లి రవీందర్ గౌడ్ ,కర్ణాకర్ చారి, నవీన్, రవి, బాలరాజ్ , మంగలి రవి తదితరులు పాల్గొన్నారు

# ప్లాస్టిక్ రహిత మంథనికి సహకరించాలి

- 5వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్



**మంథని, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ కోరారు.వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మంథని మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు కూచిరాజ్‌పల్లిలోని బీసీ, ఎస్సీ కాలనీలు, డబుల్ బెడ్‌రూం ప్రాంతాలు, శ్రీరామ్‌నగర్‌లోని పలు వీధులను ఆయన స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కమిషనర్ ఎన్. మనోహర్‌తో కలిసి పరిశీలించారు. రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్త, మురుగు కాలువల్లోని వ్యర్థాలు, పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను గుర్తించి పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేకంగా శుభ్రత పనులు చేపట్టించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. మోదుగు ఆకులతో తయారు చేసిన విస్తర్ల వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించాలని కోరారు.ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని తెలిపారు. ప్లాస్టిక్ నివారణ చర్యల్లో ప్రజలు, ఉత్సవ కమిటీలు భాగస్వాములై ప్లాస్టిక్ రహిత మంథని నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినము ప్రభుత్వమే జరపాలి



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె లక్ష్మణ్ రాసిన తెలంగాణ విమోచన దినము పుస్తకాన్ని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు కే. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ఆవిష్కరించారు.తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాల నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17 రోజును తెలంగాణ విమోచన దినముగా ప్రభుత్వం అధికారికంగా జరపాలని బీజేపీ రాజ్యసభ సభ్యులు కే. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ సర్కార్ రాజకీయ లబ్ధికోసం విమోచన దినాన్ని నిర్వహించడం లేదని మండిపడ్డారు.ఎం ఐ ఎం పార్టీకి కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ ఊడిగం చేస్తున్నాయని ఆరోపించారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలతో తెలంగాణ ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడ్డారని, మహిళలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆడించి, రాక్షస ఆనందం పొందారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, తెలంగాణ విమోచన దినమును అధికారికంగా జరుపుతామని కే. లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్, బీఆర్ ఎస్ దొందూ దొందే అని రామ్ చందర్ రావు అన్నారు.బీ ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని, కేవలం ముస్లిం ఓట్ల కోసం మెజార్టీ ప్రజల గొంతు నొక్కుతున్నారని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు ఆరోపించారు.అధికారంలోకి రాకముందు తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్ చేసిన బీఆర్ ఎస్, ఆ తరువాత మాట మార్చిందని,ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ దొంగ నాటకాలు ఆడుతుందని రాం చందర్ రావు విమర్శించారు. సెప్టెంబర్ 17ను విమోచన దినముగా ప్రకటించి, అధికారికంగా ప్రభుత్వమే జరపాలని కోరారు. సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినము అని పుస్తక రచయిత, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె లక్ష్మణ్ అన్నారు. దీనికి తెలంగాణ చరిత్రే అద్దంపడుతుం దన్నారు. కొన్ని రాజకీయ పార్టీల నేతలు స్వార్థం కోసం మెజార్టీ ప్రజల గొంతు నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఎలాంటి బేషజాలకు పోకుండా పాలకులు తెలంగాణ విమోచన దినమును అధికారికంగా జరపాల ని ప్రొఫెసర్ లక్ష్మణ్ కోరారు. ఈ సందర్భంగాకే. లక్ష్మణ్, రాంచందర్ రావు పుస్తక రచయిత ప్రొఫెసర్ గాదె లక్ష్మణ్ తో పాటు ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్స్, అధ్యాపకులు,న్యాయవాదులు, మన ఆలోచన సాధన సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గునిగంటి చంద్ర శేఖర్ లకు శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# పిసిసి అధ్యక్షునిగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ కి శుభాకాంక్షలు





**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ....మహేష్ కుమార్ గౌడ్ NSUI నాయకునిగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి ఈ రోజు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎదిగారంటే ఆది ఆయన కృషికి నిదర్శనం అని,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీని సవ్యదిశలో ముందుకు తీసుకుపోతున్నారని అన్నారు.ప్రభుత్వానికి,పార్టీకి మధ్య వారధిలా ఉంటూ కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని,పార్టీ జరిగే ప్రతి సమస్యను ముందుండి అందరిని సమన్వయ పరుస్తూ ముందుకు వెళ్తున్నారని అన్నారు.పిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గాని,మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించే విధంగా కృషి చేశారన్నారు.జిల్లాలో గ్రామ పంచాయతీలలో 70% కాంగ్రెస్ పార్టీ గెలిచిందని,రాష్ట్రంలో 7 మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 6 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే మహేష్ కుమార్ గౌడ్ నిబద్ధతకి నిదర్శనం అన్నారు.మహేష్ కుమార్ గౌడ్ రాజకీయాల్లో మరింత ఎదుగుతూ ముందుకు వెళ్లాలని కోరుకున్నారు.గతంలో YS,DS కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన విధంగా రాష్ట్రంలో మళ్ళీ CM రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కలిసి జోడెడ్ల లాగా పనిచేస్తూ మళ్ళీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని అన్నారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ని PM గా చేసే విధంగా అందరూ కలిసి పనిచేయాలని అన్నారు.ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ....మహేష్ కుమార్ గౌడ్ రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఈ స్థాయికి వచ్చారని,విద్యార్థి స్థాయి నుండి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎదిగారంటే అందరికి ఆయన నిదర్శనం అని అన్నారు.పిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ నీ ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు.నాయకులకు,కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తున్నారని అన్నారు.రాబోయే రోజుల్లో కూడా రేవంత్ రెడి మహేష్ కుమార్ గౌడ్ లు కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తారని అన్నారు.రాష్ట్రానికి ఇంతకు ముందు బీసీ ముఖ్యమంత్రులు ఇద్దరు ఉన్నారని మరోసారి మూడో ముఖ్యమంత్రి బీసీ నుండి అయితే ఆది మహేష్ కుమార్ గౌడ్ గారే అని,ఆయన నిజామాబాద్ అర్బన్ నుండి పోటీ చేస్తే ఆయనను గెలిపించేవిధంగా అందరూ పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గడుగు గంగాధర్,తాహెర్ బిన్ హాందాన్,మేయర్ ఉమారాణి,రమేష్ రెడ్డి,రామ్ భూపాల్,కవిత రెడ్డి,రామకృష్ణ,కాపుకర్ గణరాజ్,రత్నాకర్,చాట్ల నరేష్,విపుల్ గౌడ్,యాదగిరి,సంతోష్,శ్రీనివాస్,రాజేంద్ర ప్రసాద్,బంటు బలరాం,అంతరెడ్డి రాజారెడ్డి,బొంబోతుల ప్రవీణ్ గౌడ్,ప్రవీణ్ యాదవ్,కరీముద్దీన్,ఎర్రం గంగాధర్,మనోహర్,మీసాల సుధాకర్,రేవతి,మలైకా బేగం,స్వప్న,నరేందర్ తదితరులు పాల్గొన్నారు

# ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

- TGSRTC ఆర్.ఎం.కు వినతి



**నిజామాబాద్, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** నిజామాబాద్ రీజియన్‌లో TGSRTC ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ TGSRTC ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కట్టా జాయిన్ బాబు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాస సుభాష్,రాష్ట్ర ఉపాధ్యక్షులు కేసరి ఆంజనేయులు గౌడ్,వేముల అర్జున్ రావు,జాయింట్ సెక్రెటరీ మండవ రామకృష్ణ తదితర రీజియన్ నాయకులు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ (R.M.) కృష్ణమూర్తి ని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కట్టా జాయిన్ బాబు మాట్లాడుతూ....TGSRTC డిపోలు,గ్యారేజీలు,బస్ స్టేషన్లలో ఔట్సోర్సింగ్ సేవలను అందిస్తున్న కాంట్రాక్టర్లు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంస్థ అధికారులు సహృదయంతో పరిశీలించి పరిష్కరించాలని కోరారు.ప్రధాన డిమాండ్లు:

- ◆ డిపోలు,గ్యారేజీలలో అవసరమైన స్కావెంజర్ సిబ్బందిని కేటాయించాలి.
- ◆ బస్సుల వాషింగ్‌కు అవసరమైన చీపుర్లు,బ్లీచింగ్ పౌడర్,ఫినాయిల్,యాసిడ్,మాప్ స్టిక్స్ తదితర మెటీరియల్‌కు తగిన చార్జీలు చెల్లించాలి.
- ◆ కాంట్రాక్టర్ల ప్రస్తుత 7% మార్జిన్‌ను 15%కు పెంచాలి.
- ◆ ప్రతి ఆరు నెలలకు కనీస వేతనాలు పెరుగుతున్నందున,దానికి అనుగుణంగా కాంట్రాక్టర్ మార్జిన్‌ను కూడా సవరించాలి.
- ◆ వేతనాల హైక్ పేమెంట్‌ను సెక్యూరిటీ డిపాజిట్ లేకుండా అమలు చేయాలి.
- ◆ TGSRTCలో ప్రత్యేక కాంట్రాక్టర్ రిజిస్ట్రేషన్ విధానం ఏర్పాటు చేసి,రిజిస్ట్రేషన్ పొందిన కాంట్రాక్టర్లకు స్థానిక ప్రాధాన్యతతో టెండర్లలో అవకాశం కల్పించాలి.
- ◆ కార్మికుల వేతనం ₹15,000 దాటినప్పుడు వర్తించే స్లాబ్ ప్రకారం Professional Tax చెల్లించే విధానం స్పష్టంగా అమలు చేయాలి.
- ◆ ఔట్సోర్సింగ్ బస్ డ్రైవర్లు,కండక్టర్లకు ESI,PF అమలు చేసి సామాజిక భద్రత కల్పించాలి.
- ◆ కాంట్రాక్టర్లపై విధిస్తున్న స్టాంప్ డ్యూటీ విధానాన్ని తొలగించాలి.ఈ సమస్యలను పరిశీలించి,కాంట్రాక్టర్లు,కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు TGSRTC అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రీజియన్ ప్రధాన కార్యదర్శి కే సుస్మిత్,KA ఖాన్,బి సునీల్,హైదరాబాద్ అధ్యక్షులు పూర్ణచందర్,జె. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న ప్రెస్ క్లబ్..

- నిరుపేద కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకుల పంపిణీ.



**సూర్యాపేట, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి కోదాడ ప్రెస్ క్లబ్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. కోదాడ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని చెరువు కట్ట బజారులో నివసిస్తున్న ఎండీ రహమత్ కుటుంబానికి బుధవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.వెన్నుపూస సమస్యతో పాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రహమత్ కుటుంబ యజమాని ఉపాధి కోల్పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిన విషయాన్ని ప్రెస్ క్లబ్ సభ్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో దాతల సహకారంతో ఆ కుటుంబానికి నెల రోజులకు సరిపడా బియ్యం, వంట నూనె, పప్పులు, కారం, ఉప్పు తదితర నిత్యావసర కిరాణా సరుకులను అందజేశారు.ఈ కార్యక్రమానికి మేళ్లచెరువు గ్రామానికి చెందిన ఎస్టీఆర్ బాలు, కోదాడ పట్టణంలోని రామాలయం ఆలయ అర్చకులు కాండూరి వంశీకృష్ణ చార్యులు తమవంతు సహకారం అందించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం అంజి మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి తమవంతు సహాయం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రెస్ క్లబ్ పిలుపునకు స్పందించి నిత్యావసర సరుకుల పంపిణీకి సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కష్టకాలంలో తమ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించి అండగా నిలిచిన ప్రెస్ క్లబ్ సభ్యులు, దాతలకు ఎండి రహమత్ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోదాడ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బాణాల అబ్రహం, ప్రధాన కార్యదర్శి బండారు నాగరాజు, కోశాధికారి నూరుద్దీన్, కార్యవర్గ సభ్యులు.

# సేవా సంకల్ప్ అభియాన్‌కు శ్రీకారం

- నెలరోజుల పాటు సేవా కార్యక్రమాలు
- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాజీవితానికి గుర్తుగా కేంద్రం కార్యక్రమం
- సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు
- 22ఏ భూముల లెక్కలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బిజెపి జాతీయ నాయకులు కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్‌ను తెలంగాణలో విస్తృతంగా నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు, కర్ణాటక–తమిళనాడు రాష్ట్రాల కో–ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నెలరోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే అభియాన్ లక్ష్యమని చెప్పారు. ఖమ్మంలోని భాజపా జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**సేవే సంకల్పంగా, నెలరోజుల కార్యక్రమాలు**

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటడం, ఆరోగ్య శిబిరాలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. సమాజంలోని వివిధ వర్గాలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ సేవా ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడమే ప్రధాన ఉద్దేశమని వివరించారు.

**విద్యార్థులు, మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు**

విద్యార్థుల్లో దేశభక్తి, దేశ నిర్మాణంపై అవగాహన పెంచేలా వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు విద్యార్థులకు 'నా కలల భారతదేశం' అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళలకు రంగోలి పోటీలు, యువతకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి శక్తి కేంద్రం పరిధిలో సేవా జ్యోతి ర్యాలీలు నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు.

**సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మమేకం**

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులను నేరుగా కలుసుకుని వారి అనుభవాలను తెలుసుకునే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఉచిత రేషన్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జనధన్ ఖాతాలు తదితర పథకాల లబ్ధిదారులతో పార్టీ శ్రేణులు మమేకం కానున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అవగాహన కల్పించడంతో పాటు, ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించడమే అభియాన్‌లోని ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని తెలిపారు.

**తెలంగాణ విమోచన దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యం**

సెప్టెంబరు 17కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని సుధాకర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్థానం నిజాం పాలన నుంచి విముక్తి పొందిన సందర్భాన్ని స్మరించుకుంటూ, ఆ పోరాటంలో పాల్గొన్న యోధుల త్యాగాలను గుర్తుచేసుకునే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్‌తో ఈ కార్యక్రమాలను అనుసంధానిస్తూ ప్రజల్లో దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

**22ఏ భూముల లెక్కలపై శ్వేతపత్రం**

సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను వెల్లడించిన అనంతరం రాష్ట్రంలోని భూ సమస్యలపై సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ధరణి నుంచి భూ భారతి వరకు భూ రికార్డుల నిర్వహణలో చోటుచేసుకున్న మార్పులు, 22ఏ నిషేధిత భూముల జాబితా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పెండింగ్ ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.22ఏ భూములపై ప్రభుత్వం చెబుతున్న గణాంకాలకు, రాజకీయంగా ప్రచారంలో ఉన్న ఇతర లెక్కలకు మధ్య వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబరు వారీగా పూర్తి వివరాలను బహిరంగపరచాలని, ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేస్తే అనుమానాలకు తావుండదని అన్నారు.

**47,440 ఎకరాల తగ్గుదలపై వివరణ కోరిన సుధాకర్‌రెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో వెల్లడించిన వివరాల ప్రకారం 2023 డిసెంబరు 7న 22ఏ జాబితాలో 1,02,52,690 ఎకరాలు ఉండగా, 2026 ఆగస్టు 31 నాటికి 1,02,05,250 ఎకరాలకు తగ్గినట్లు, అంటే 47,440 ఎకరాల నికర తగ్గుదల నమోదైనట్లు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే జాబితాలోకి కొత్తగా ఎంత భూమి చేరింది, ఎంత భూమిని తొలగించారు, ఏ కారణాలతో తొలగించారు, ప్రభుత్వ భూమి ఎంత, దేవాదాయ భూమి ఎంత, ప్రైవేటు పట్టా భూమి ఎంత అనే వివరాలు కూడా ప్రజలకు తెలియాలని కోరారు. కేవలం మొత్తం విస్తీర్ణం తగ్గుదలను చూపించడం కాకుండా సర్వే నంబరు స్థాయి వరకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**ఖమ్మంలో 980 భూ ఫిర్యాదులు**

ఖమ్మం జిల్లాలో సర్వేలు, సరిహద్దులు, భూ రికార్డులకు సంబంధించిన సుమారు 980 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. భూ సమస్యలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటే రైతులు, కుటుంబాలు, ఆస్తి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. రాజకీయ కోణంలో కాకుండా రికార్డులను పరిశీలించి చట్టబద్ధంగా ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని సూచించారు.

**ప్రభుత్వ, దేవాదాయ భూములకు రక్షణ**

ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సుధాకర్‌రెడ్డి అన్నారు. అదే సమయంలో రికార్డుల పొరపాట్ల కారణంగా చట్టబద్ధమైన ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలో చిక్కుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.భూ రికార్డుల్లో తప్పులు జరిగితే వాటి ప్రభావం విక్రయాలు, వారసత్వ బదలాయింపులు, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల భూ పరిపాలనలో ఖచ్చితత్వం, పారదర్శకత, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**మెగా ఫుడ్‌పార్క్‌పైనా వివరాలు ఇవ్వాలి**

ఖమ్మం ప్రాంతానికి సంబంధించిన మెగా ఫుడ్‌పార్క్ వ్యవహారంపైనా సుధాకర్‌రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. దీపక్ నైట్రేట్ సంస్థ సుమారు రూ.600 కోట్ల పెట్టుబడితో చేపడుతున్నట్లు చెబుతున్న ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడి ప్రతిపాదనలు, భూముల కేటాయింపు, అనుమతులు, ప్రాజెక్టు ప్రయోజనాలపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. ఈ వ్యవహారంలో అనుమానాలుంటే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థ నుంచి స్వతంత్రంగా ధ్రువీకరించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించాల్సి ఉంది.

**భూ సమస్యలు రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలి**

ధరణి, భూ భారతి, 22ఏ అంశాలను రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సుధాకర్‌రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పులు ఉంటే వాటిని సరిదిద్దాలని, ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యలను పూర్తి గణాంకాలతో ప్రజలకు వివరించాలని కోరారు.జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబరు స్థాయిలో భూ రికార్డులను పారదర్శకంగా అందుబాటులో ఉంచితే ప్రజలకు మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ ఫిర్యాదులను కాలపరిమితిలో పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు సన్నీ ఉదయ ప్రతాప్, గుత్తా వెంకటేశ్వర్లు, గోగూర వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, మంద సరస్వతి, శ్రీరామనేని మణి, మాధవ్, రవి గౌడ్, కుమిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ వర్కర్స్ కు పల్లెప్రపంచం ఫౌండేషన్ వితరణ



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్స్ కు పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు బట్టలు బహుకరించారు. పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు కూతురు పల్లా చైతన్య బర్త్ డే సందర్భంగా బుధవారం ఉదయం పంచాయతీ పరిధిలోని బోయన సుధాకర్, దరిశ రాము, కొత్తపల్లి రమేష్, షేక్ హస్సాన్ సాహెబ్ లకు పదివేల రూపాయలు విలువ చేసే నూతన వస్త్రాలు బహుకరించారు. ప్యాంట్, షర్ట్, టీ షర్ట్, టవల్స్ ను ఇచ్చారు. ఈ సందర్భంగా పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు మాట్లాడుతూ ప్రతి ఏటా తమ ఇంట్లో వివిధ ఫంక్షన్ లకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17 న తన కూతురు చైతన్య బర్త్ డే సందర్భంగా ఒక రోజు ముందు గానే ఈ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా పిల్లలకు క్విజ్ ను గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పల్లా కొండలరావు చొప్పకట్లపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గా, మండల ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులుగా ఉన్నారు.

## యూపీఐ చెల్లింపులపై టాక్స్ వేసే యత్నం ను నిరశిస్తూ నిరసనలు తెలపండి : సిపిఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అని తెచ్చిన జీఎస్టీ , యూపీఐ చెల్లింపుల మీద పన్ను వేసి , ప్రజల పై భారం వేసిన, వేస్తున్న విధానాన్ని సిపిఐ ఎంఎ ల్ మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తున్నదని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ పేరుతో ఇప్పటికే ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు . నేడు సాధారణ ప్రజలనందరిని యూపీఐ చెల్లింపులకు అలవాటు చేసి,నేడు టాక్స్ వేసే యత్నం అత్యంత మోసపూరిత చర్యయని వారన్నారు . అమెరికా, వీసా, మాస్టర్ కార్డ్ ల వత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించిందన్నారు. తమ లావాదేవీలకు ఇవి నష్టం తెస్తున్నాయని అమెరికా ఆగ్రహిస్తున్నదన్నారు . దాని ప్రభావంతో మోడీ ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించిందన్నారు . ఇది ప్రజావ్యతిరేక చర్యయన్నారు . కేంద్ర ప్రభుత్వం ప్రజల పై భారం వేసే విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 17,18 తేదీలలో ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని ప్రజలను కోరుతున్నామని వారు తెలిపారు.

## రోకటి సుష్మకు అభినందనలు శెట్టి రంగారావు



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన మున్నూరు కాపు బిడ్డ రోకటి సుష్మకు ఎం బిబిఎస్ లో ఫ్రీ సీటు రావడం పట్ల అభినందనలు తెలియచేసిన మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు దంపతులు. ఈవిషయం తెలుసుకొని వారి స్వగ్రామం పాపకొల్లు వెళ్ళి చదువుల తల్లి సుష్మకు శాలువాతో సత్కరించి సన్మానం చేసి అభినందనలు తెలియ చేయడం జరిగింది. వైద్య వృత్తి చాలా ఖరీదు ఐనది అటువంటిది తనకు ఫ్రీ సీటు రావడం చాలా గ్రేట్ అని కొనియాడారు. చాలా కష్టపడి ఇద్దరు ఆడపిల్లలను చదివించిన తల్లి తండ్రులు రోకటి ప్రమీల – రమేష్ లను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగుమతి శాఖ కార్యదర్శి బైరిశెట్టి శ్రీనివాసరావు,శెట్టి సత్యవతి, జి శ్రీదేవి, గోపిశెట్టి శ్రీనివాసరావు, రోకటి శ్రీనివాస్ రావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు తరగతులు

**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో జూనియర్ న్యాయవాదులు కమీషనర్లు గా నియమించబడుతున్నారు. వారికీ కమీషనర్ వర్క్ ఎలా నిర్వహించాలి, మార్కింగ్ ఆఫ్ డాకుమెంట్స్ ఎలా చెయ్యాలి అనే అంశాలపై అవగాహన సదస్సును ఖమ్మం న్యాయవాద పరిషత్ వారి ఆధ్వర్యంలో ఇల్లందు క్రాస్ రోడ్ దగ్గర లో గల వేదిక ఫంక్షన్ హాల్ నందు గురువారం సాయంత్రం ఐదున్నర గంటలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయనైనది.ఈ సదస్సు కు ముఖ్య అతిధిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు , గెస్ట్ అఫ్ హానర్, స్పీకర్ గా ఫామిలీ కోర్టు న్యారమూర్తి జివి మహేష్ నేత, ఎస్ సి, ఎస్ టి కోర్టు జడ్జి , ఉమెన్ కోర్టు జడ్జి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై. రమేష్ అతిధిలు గా హాజరువుతున్నారు. కావున న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమం ను జయప్రదం చేయలని న్యాయవాద పరిషత్ ఖమ్మం శాఖ అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు.

# నేటి నుండి ఖమ్మం అర్బన్ మండల క్రీడలు ప్రారంభం



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** నేటి నుండి మూడు రోజుల పాటు ఖమ్మం అర్బన్ మండల్ నార్త్ లెవెల్ గేమ్స్ మీట్ న్యూ విజన్ స్కూల్ ఖమ్మం నందు జరగనున్నాయని ఎస్ జి ఎఫ్ మండల కార్యదర్శి బియ్యని కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారిని శైలజాలక్ష్మి , కన్వీనర్ న్యూ విజన్ స్కూల్ ప్రిన్సిపల్ ఆలీ మాట్లాడుతూ ఖమ్మం అర్బన్ మండలం నార్త్ లేబర్లోని ప్రభుత్వ ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు అండర్ 14 అండర్, 17 బాల బాలికలు కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, క్రీడల్లో పాల్గొనుటకు అర్హులని, 17– 9– 2026న అండర్ 14 అండర్ 17 బాలురకు , 18 –9 –2026 అండర్ 14 అండర్ 17 బాలికలకు కబడ్డీ కోకో వాలీబాల్ క్రీడలు ఉంటాయని వారు తెలియజేశారు . విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొని విజయాన్ని పొంది జిల్లా స్థాయిలో జరిగే అటువంటి క్రీడలకు సిద్ధపడి జిల్లా స్థాయిలో మన ఖమ్మం అర్బన్ మండలం నార్త్ లెవెల్ నుండి విజయాన్ని సాధించాలని వారు తెలియజేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు నాగుల్ మీర , రాము నాగ ప్రసాద్ , రోజ, సంపత్ కుమార్, పిడి, టిడిపి లు హాజరై జరిగే క్రీడలకు డ్రాస్ తీయడం జరిగిందని వారు తెలియజేశారు.

# వీరుల ఆశయాలు వృధా కావు
## - సిపిఐ నేత భాగం హే మంత్ రావు



**ఖమ్మం, కొణిజర్ల, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల ఆశయాలు వృధా కావు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాల సందర్భంగా తనికెళ్ల, కొనిజర్ల ,తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సిపిఐ నాయకులు అమర జీవులు గడల సీతా రామయ్య, దొండపాటి వెంకయ్యల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం నైజాం రాక్షసి పాలన అంతం కోసం, పోరాడి తమ ప్రాణ త్యాగాలు చేసిన యోధులును ప్రభుత్వం గుర్తించి అమరవీరుల వారోత్సవాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని వారున్నారు. ఆనాటి రైతాంగ సాయుధ పోరాటం ద్వారానే సాధించుకున్న సాగు భూములు ఇళ్ల స్థలాలు తప్ప నేటి వరకు ప్రభుత్వాలు ప్రజలకు సాగు భూమిని పేదలకు అందించిన చరిత్ర శూన్యమని వారు ఆరోపించారు. త్యాగ వీరుల స్ఫూర్తి తో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శిదండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బాబు, దొండపాటి రమేష్, మండల కార్యదర్శి గడల భాస్కర్, మండల సహాయ కార్యదర్శులు స్వర్ణ రమేష్, తుమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మునిగ కోటేశ్వరరావు, యాస వెంకటేశ్వర్లు, పాపగంటి సుదర్శన్, పివి రావు, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, చల్ల మోహన్ రావు, తోటపల్లి సీతారాములు, పెదమల రత్తయ్య, పుట్టా సత్య నారాయణ, బాణావతి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# అమర్ హై, షోయబుల్లా ఖాన్

- జర్నలిజం అనే ఆయుధంతో నిజాం, రజాకార్ల దమనకాండపై పోరాటం
- పాలేరు నియోజకవర్గంలో ఘన నివాళి
- వమోచన దిన వారోత్సవాల్లో షోయబుల్లా ఖాన్ త్యాగస్ఫూర్తిని స్మరించిన భాజపా నాయకులు



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** నిజాం పాలన, ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల దమనకాండకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు జర్నలిజాన్ని ఆయుధంగా మలుచుకుని పోరాడి ప్రాణత్యాగం చేసిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్ త్యాగాలను స్మరించుకుంటూబీజేపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ విమోచన దిన వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని సుబ్లేడ్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ప్రజల కోసం కలాన్ని ఆయుధంగా మలిచి**

నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న నిర్బంధం, రజాకార్ల అకృత్యాలపై షోయబుల్లా ఖాన్ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి బలిదానం చేసిన ఆయనను స్ఫూర్తిదాయక పాత్రికేయుడిగా కొనియాడారు.జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని, అన్యాయాన్ని ప్రశ్నించేందుకు కలం కూడా శక్తిమంతమైన ఆయుధమేనని షోయబుల్లా ఖాన్ తన జీవితంతో నిరూపించారని వారు పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేసిన ఆయన త్యాగాన్ని నేటితరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**విమోచన దిన వారోత్సవాల్లో కార్యక్రమం**

తెలంగాణ విమోచన దిన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖమ్మం జిల్లా భాజపా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, భాజపా కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రవికుమార్ నున్న, రాష్ట్ర నాయకుడు రుద్ర ప్రదీప్, శామ్ రాథోడ్, తక్కెళ్లపల్లి నరేంద్ర రావు, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేకా సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పలువురు నాయకుల హాజరు**

జిల్లా నాయకులు అనంతు ఉపేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అనగాని రామారావు, మల్లారెడ్డి, మండల అధ్యక్షులు బొడ్డు ప్రసాద్, పాగర్తి సుధాకర్, పుణ్యవతి, సత్తి నాగరాజుతో పాటు పలువురు భాజపా నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా షోయబుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ 'అమర్ హై' అంటూ నినదించారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయడంతో పాటు, స్వేచ్ఛ కోసం పోరాడిన యోధుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

# విద్యారంగంలో కృత్రిమ మేధ, తీరుతెన్నులు

**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఆధునిక విద్యావ్యవస్థ కృత్రిమ మేధపై అతిగా ఆధారపడితే వెన్నుముక లేని జాతి రూపుదిద్దుకునే ప్రమాదం ఉందని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక విజ్ఞాన్ విద్యాలయం లో ఈ అంశంపై బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడుతూ సాంకేతికత విపరీతంగా పెరిగిన ఈ రోజుల్లో విద్యారంగంలో 'కృత్రిమ మేధ' పెద్ద మార్పులు తెస్తుందని భావిస్తున్నారని, కానీ ప్రపంచంలోనే అత్యంత ఆధునిక నగరమైన న్యూయార్క్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి వరకు విద్యార్థులు దీని వాడకంపై నిషేధం విధించారని తెలిపారు. ఆరేళ్ల పిల్లవాడు ఉల్లిపాయ కోయలేడు, కానీ పదహారేళ్లకు ఆ పని చేయగల పరిణతి వస్తుంది. సాంకేతికత కూడా అంతే, మానసిక పరిపక్వత వచ్చే వరకు పిల్లలను దీనికి దూరంగా ఉంచాలని తెలుపుతూ ప్రశ్నలకు జవాబులు రాబట్టటం అనేది నేర్చుకునే క్రమంలో భాగం. దాన్ని సొంతంగా వెతికి, ఆలోచించి, పరిశోధించి తెలుసుకున్నపుడే ఆలోచనా శక్తి పెరుగుతుందని, క్షణాల్లో సమాధానం లభించే సాంకేతికత వల్ల విద్యార్థి ఆలోచించే శక్తి కోల్పోతాడని అన్నారు. పిల్లలకు కావలసింది రోబోలు కాదని, వారి భావోద్వేగాలను అర్థం చేసుకునే జ్ఞానసంపన్నులైన గురువులని వివరించారు . మన దేశ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి డిజిటల్ డివైస్ లేకపోవడం ఒక రకంగా మంచిదేనని, మన పిల్లలకు పునాది అక్షరాస్యత, గణితం, విజ్ఞానశాస్త్రాలను సృజనాత్మకంగా నేర్పించే బాధ్యత మన ఉపాధ్యాయుల చేతుల్లో సురక్షితంగా ఉందని పేర్కొంటూ అసలు సమస్య పాఠశాలల్లో లేదు. ప్రతి ఇంట్లో ఉందని, నేడు ప్రతి ఇంట్లోనూ స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ లభ్యత పెరిగి పిల్లవాడు పాఠశాల వదిలి ఇంటికి వెళ్లగానే ఫోన్ చేతికి వస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల వెలువడిన 'ఎకనామిక్ సర్వే' కూడా పిల్లల్లో స్క్రీన్ టైమ్ పెరగడం వల్ల ఆరోగ్య, మానసిక, విద్యాపరమైన సమస్యలు వస్తున్నాయని హెచ్చరించిందని, పిల్లల్లో స్వయం ఆలోచనా శక్తిని, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలని, సమాధానాలు టకటకా చెప్పే డిజిటల్ రోబోల లాంటి తరాన్ని కాకుండా సృజనాత్మకంగా ఆలోచించి సమస్యలను పరిష్కరించే చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే విద్య యొక్క అసలైన పరమావధి అని సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఈ దిశగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విధాన నిర్ణేతలు ఆలోచించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో విద్యాలయం శిక్షకులు, విద్యార్థులు, ఉన్నత విద్యావంతులు పాల్గొన్నారు..

# ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
## - జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

- అనామిలిస్, మ్యామింగ్ ఓటర్ల జాబితా వేగవంతం చేయాలి
- కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి త్వరితగతిన జారీ చేయాలి
- బిఎల్ఓ లు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలి
- ఖమ్మం నగరంలో పాత డిఆర్డీవో కార్యాలయం ఆవరణ జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు నిరేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, నోటీసులు అందుకున్న వారిలో ఏ, బి, సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు.నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ప్రజా ఉద్యమమే నాణ్యమైన విద్యకు పునాది

- రౌండ్ టేబుల్ సమావేశం లో మాజీ తెలంగాణా విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ప్రజలకు నాణ్యమైన విద్య లభించాలంటే రాజకీయ వ్యవస్థ పై ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణా మాజీ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు . ప్రజల నుండి డిమాండ్ లేకుండా ఏ పాలకవర్గం విద్యా వ్యవస్థను సరిదిద్దుతుందని భావించలేం, ఆశించడం కూడా పొరపాటు అవుతుందని అన్నారు . బుదవారం ఖమ్మం మయూరి సెంటర్ లోని శ్రీధర హోటల్ లో విద్యాబిమానులు , ఉపాధ్యాయ , విద్యార్థి సంఘాలు , విద్యార్థుల తల్లిదండ్రులు , సామాజిక కార్యకర్త లుతదితర వర్గాలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆయన మాట్లాడారు . ప్రస్తుతం తెలంగాణా ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసియులో ఉందని , ప్రజలే డాక్టర్లు గా మారి దానికి చికిత్స చేసి బ్రతికించుకోవాలని పిలుపునిచ్చారు . ప్రతిసంవత్సరం 40లక్షలమంది పిల్లల తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని అన్నారు . ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ కు చట్టం చేయవలసిన అవసరం ఉందని అన్నారు . ప్రభుత్వ పాఠశాల లను అన్ని సౌకర్యాలు గల తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ గా మార్చితే ప్రైవేటు బడులకు పిల్లలను పంపాల్సిన అఘాయిత్యం ఏముంటుంది అని ప్రశ్నించారు . ప్రభుత్వ పాఠశాల ల్లో ప్రస్తుతం 37శాతం మంది పిల్లలే చదువుతున్నారని అన్నారు . ఇలాగే అసౌకర్యంగా కొనసాగితే మరింత ప్రభుత్వ బడి దిగజారే అవకాశం ఉందని అన్నారు . జాతీయ స్థాయి యుడైస్ గణాంకాలు ప్రకారం తెలంగాణా లో 2,582 ఓకే గదిలో నడుస్తున్న పాఠశాలలు ఉన్నాయని , సున్నా విద్యార్థుల నమోదుతో 2,245 పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు . మూతపడ్డ పాఠశాలల జాబితా లో మన రాష్ట్రం రెండవ స్థానం లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు . తెలంగాణాలో ప్రతి పిల్లవాడికి విద్య అందాలంటే బడ్జెట్ లో కనీసం గా 18శాతం నిధులు కెటాయించాలని అన్నారు . ప్రైవేటు పాఠశాల మౌళిక సదుపాయాల ను , భూమి విలువ , భావన విలువ , ఉపాద్యాయులు అర్హతలు , వేతనాలు , విద్యార్థుల కు అందిస్తున్న సౌకర్యాలు దృష్టి లో పెట్టుకొని ప్రైవేటు పాఠశాల నియంత్రణ చట్టం తేవాలని అన్నారు . ప్రజలకు అవసరం అయిన మౌళిక సౌకర్యాలు కలిగించే ప్రభుత్వం రావాలంటే నోటు తీసుకోకుండా ప్రజలు ఓటేసే స్థితి రావాలని అన్నారు . రౌండుటేబుల్ సమావేశం లో బస్సుయాత్ర లో పాల్గొన్న తెలంగాణా ప్రజా ఫ్రంటు కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పద్మజాషా , ఐఏయస్ మాజీ అధికారి యం.చంపాలాల్ , పి.అశోక్ కుమార్ , సృజన యాదవ్ , యం.కు పోరన్న , యం.నర్సింహరావు , హరీష్ , రుబీనా , నిఖిల్ , జగదీష్ తదితరులు పాల్గొన్నారు . రౌండ్ టేబుల్ సమావేశం కు సీనియర్ జర్నలిస్టు , ఎద్యుకేషన్ ఎనలిస్టు ఎన్.తిర్మల్ మోడరేటర్ గా వ్యవహరించారు రౌండ్ టేబుల్ సమావేశం లో డాక్టర్ యంయఫ్ గోపినాథ్ , భద్రూనాయక్ , పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు కట్టా.శేఖర్ , టిపిటీయఫ్ జిల్లా అధ్యక్షులు జి.మల్లయ్య , యుటీయఫ్ ప్రతినిధి ఉద్దండు , ధర్మసమాజ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ , పిడియస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్ , బలహీన వర్గాల జాక్ కన్వినర్ పి.రాంబాబు , కనకయ్య , రిటైర్ ఉపాద్యాయ సంఘం జిల్లా కార్యదర్శి టి.వేణు , నాగిరెడ్డి , ప్రజానాట్యమండలి దేవేందర్ , బొబ్బిలి భారత్ చంద్ర , మణిభూషణాచారి , ఖలీల్ , ఝాన్సీ , సునీత , సృజన , విజయకుమార్ , గుంతేటి వీరభద్రం తదితర 30 మంది విద్యారంగం ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు . రౌండుటేబుల్ సమావేశం ప్రభుత్వ బడులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దడానికి మండలానికి నాలుగు తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని , ప్రైవేటు పాఠశాల ఫీజులు నియంత్రణ చేయాలని , చట్టబద్ధం గా విద్యకు బడ్జెట్ లో ప్రతిఏటా 18శాతం నిధులు కెటాయించాలని సమావేశం తీర్మానం చేసింది . ఈమూడు అంశాలపై జరిగే ఉద్యమానికి సైతం తనసంపూర్మ మద్దతు రౌండ్ టేబుల్ సమావేశం ప్రకటించింది .

# కేసీఆర్ హయాంలో సి ఎం ఆర్ఎఫ్ ఆపద్బాంధవుడు

- నేడు కాంగ్రెస్ పరిపాలనలో దుస్థితి
- ఖమ్మం జిల్లా తెలంగాణ భవన్‌లో 72 మంది లబ్ధిదారులకు రూ 15,48,500 చెక్కుల అందజేత
- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్





**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని, పేదల ప్రాణాలు నిలిపే ముఖ్యమంత్రి సహాయనిధి (సి ఎం ఆర్ఎఫ్) చెక్కులకు సైతం పరిమితులు (సీలింగ్) విధించి తీవ్ర అన్యాయం చేస్తోందని ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మండిపడ్డారు.ఖమ్మం నగరం లోని తెలంగాణ భవన్ (జిల్లా బిఆర్ఎస్ కార్యాలయం)లో నిర్వహించిన కార్యక్రమంలో తన సిఫారసుతో మంజూరైన రూ. 15,48,500 విలువ చేసే 72 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఏటా ప్రభుత్వ బడ్జెట్ నుంచి రూ. 2,000 కోట్లను కేటాయించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలకు రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఎల్ఓసిలు, చెక్కులు అందించి ప్రాణాలు నిలబెట్టారని గుర్తుచేశారు. నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌పై సీలింగ్ పెట్టి తీవ్ర కోతలు విధిస్తోందని, చివరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలే సీఎం కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులు సమర్పించలేక నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.కేసీఆర్ పాలనలో ఇంట్లో కూర్చుని ఎరువుల బస్తాలు తెచ్చుకునే పరిస్థితి ఉండగా, నేడు యాప్‌లు, ఓటీపీల పేరిట రైతులను రోడ్లపై నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్, ఎరువులు ఇవ్వలేకనే మోటార్లను ఆన్ చేయకుండా ప్రాజెక్టుల నీటిని విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళలకు తులం బంగారం, రైతులకు రూ. 15 వేల భరోసా, యువతకు ఏటా 2 లక్షల ఉద్యోగాలంటూ అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నేడు ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. గ్రామాల్లో పంచాయతీలకు నిధులు లేక కనీసం బ్లీచింగ్ చల్లించే పరిస్థితి కూడా కరువైందని ధ్వజమెత్తారు.స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా తన పదవీ కాలం ఉన్నంతవరకు నియోజకవర్గ ప్రజలకు, పేదలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సహాయాన్ని అందిస్తానని తాతా మధుసూదన్ స్పష్టం చేశారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి, సంక్షేమం మళ్లీ గాడిన పడాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, తిరుమలాయపాలెం మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న, ముదిగొండ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, చింతకాని పార్టీ కార్యదర్శి వెంకట రామారావు, ఖమ్మం రూరల్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పేరం వెంకటేశ్వర్లు, నాయకులు పోట్ల ప్రసాద్, లగడపాటి శ్రీనివాస్ రావు, నరేందర్, వెంకట్రావు, రఫీ, బలుసు మురళి కృష్ణ, చలపతిరావు, శ్రీనులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యూపిఐ పై చార్జీల దోపిడీ, పేదోడి జేబు కొట్టే కుట్ర

**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** సామాన్యుడు డిజిటల్ పేమెంట్ చేస్తే కూడా చార్జీల పేరుతో దోచుకోవాలని చూస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరు దారుణమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ధ్వజమెత్తారు. కొత్తగా యూపిఐ పేమెంట్లపై చార్జీలు వసూలు చేయాలని కేంద్రం యోచిస్తుండటంపై ఆయన తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నోట్ల రద్దుతో మొదలుపెట్టి డిజిటల్ ఇండియా అని గొప్పలు చెప్పి, ఇప్పుడు అదే డిజిటల్ లావాదేవీలపై చార్జీల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల రక్తం తాగాలని చూస్తోంది బీజేపీ. టీ కొట్టు, కూరగాయల బండి దగ్గర కూడా 10 రూపాయలు యూపిఐ చేస్తే చార్జీ కట్టాలా? ఇది దోపిడీ కాదా?అదే విధంగా నాడు నల్లధనం తీసుకొచ్చి పేద ప్రజల అకౌంట్ లో వేస్తామని మోసంచేసింది నిజం కాదా?కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు మాఫీ చేసే మోదీ ప్రభుత్వం, సామాన్యుడి చెమట డబ్బుపై కన్నేసింది. బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్ లేదని దోపిడీ, ఇప్పుడుయూపిఐ చేస్తే దోపిడీ. ఇది ప్రజా ప్రభుత్వమా? దోపిడీ ప్రభుత్వమా?తక్షణమే యూపిఐ చార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరిచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. బీజేపీ దోపిడీ విధానాలను ప్రజల్లో ఎండగడతాం" అని హెచ్చరించారు.



# టీఎస్కేసి అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో 18న జాబ్ మేళా

**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** స్థానిక ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల లో గల తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్& కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్ జూనియర్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు జాబ్ మేళా ను 18 న సెమినార్ హాల్లో ఉదయం 11గంటలనుండి నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన పురుషులు, ద్విచక్ర వాహనం ఉండి ,27 సంవత్సరాల లోపు ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.ఇతర వివరాలకు కళాశాల టిఎస్కేసి లో సంప్రదించాలని సూచించారు.

# బి ఆర్ఎస్ పార్టీ అనుచిత వ్యాఖ్యలు తగదు : మేకల మల్లిబాబు యాదవ్



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్ర అభివృద్ధి ద్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనేక సంచలనాత్మక నిర్ణయాలతో పాలన చేస్తుంటే, ఓర్వలేని బిఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని ఎక్కడ కోల్పోతామో అన్న భయం తో ప్రభుత్వ కీలక నేతలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, దానిలో భాగంగా రెవిన్యూ వ్యవస్థలో ప్రక్షాళన చేస్తూ ప్రజలకు అతి చేరువవుతున్న ప్రియతమ రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఈ వ్యాఖ్యలను పొంగులేటి ముఖ్య అనుచరులు, డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పీటిసి మేకల మల్లిబాబు యాదవ్ తీవ్రంగా ఖండించారు. బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తలు పొంగులేటి అభిమానుల సమావేశంలో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సెంటిమెంట్ ద్వారా అధికారంలోకి వచ్చిన గత టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని ధ్వంసం చేయడం జరిగిందని, 58,59 జీవోలను కొత్తగా ప్రవేశపెట్టి ఎక్కడ ఖాళీ భూములు ఉంటే ఈ జీవో ను ఉపయోగించి టిఆర్ఎస్ నాయకులు భూ కబ్జాలు చేశారని, రూ 1,25,000 కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయంగామారిందని,టిఆర్ఎస్ పార్టీ వారికి ఏటీఎం గా మారిపోయిందని, ధరణి పేరుతో గ్రామంలో రెవిన్యూ వ్యవస్థను నిర్వీర్యపరచడం జరిగిందని, ధరణి పేరుతో పట్టాలు ఇవ్వకుండా అతి కఠినమైన నిర్ణయాలతో, భూ రిజిస్ట్రేషన్లు జరగలేదని, ఎంతో లోప భూయిష్టంగా ఉన్న ధరణి స్థానంలో అతి సులభంగా సామాన్యులు రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలుగా భూభారతి ని ప్రవేశపెట్టడం జరిగిందని, ప్రజలందరికీ పారదర్శకమైన పరిపాలన అందడంతో జీర్ణించుకోలేక, కనీసం అసెంబ్లీకి వచ్చి రాష్ట్ర పరిస్థితులను సభా దృష్టికి తీసుకురాలేని ప్రతిపక్ష నాయకుడు ఉండడం దురదృష్టమని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనివ్వనని ఛాలెంజ్ చేసి, మాట ఇచ్చిన విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై టిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, లేనియెడల వారికి తగురీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంటుందని, మీరు ఎంత జిమ్మిక్కులు చేసినా మళ్లీ వచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండిపాడు గ్రామపంచాయతీ బాధ్యులు గుగులోతు రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, బాదావత్ నాగరాజు,వడ్డెర సంఘం మండల అధ్యక్షులు, దేరంగుల తిరపయ్య, బండి ఉపేందర్, తురక బిక్షం మొగిలి శ్రీను, చల్ల మల్లయ్య పగిడిపల్లి రాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# 20 న నగేష్ సంస్మరణ సభ



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఇటీవలి ఆకస్మికంగా మరణించిన స్వరమధురిమ కల్చరల్స్ దివంగత అధ్యక్షులు ఇసనపల్లి నగేష్ సంస్మరణ సభను ఈ నెల 20 న ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించినున్నట్లు వియంయన్ కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు వంజా మాలతి నాయుడు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు సినీ సంగీత నివాళి సమర్పించనున్నామని,నగేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయమందజేసి భరోసా కల్పించనున్నట్లు వివరించారు. ఖమ్మం కళాసంస్థల నిర్వాహకులు, కళాకారులు, గాయనీగాయకులు ఈ కారాయక్రమానికి సహకరించి దివంగత కళాకారునికి నివాళి అర్పించవలసిందిగా కోరారు.

# విద్యానగర్ రోడ్ నెంబర్ ఆరులో వినాయక చవితి వేడుకలు



**ఖమ్మం, సెప్టెంబర్ 16 , నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 58 డివిజన్ లో గల విద్యానగర్ రోడ్ నెంబర్ ఆరులో ఆయా ఏరియాలో నివాసం ఉంటున్న ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీ వినాయకస్వామి మండపంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కూచిపూడి శ్రీనివాసరావు దంపతులు, కృష్ణమూర్తి దంపతులతో కలిసి ప్రతేకంగా పూజలు నిర్వహించారు. మండపం వద్దకు చేరుకున్న కూచిపూడి కి బాణాసంచా, డప్పు వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం పూర్ణకుంభంతో వినాయక మండపం వద్దకు ఆహ్వానించిన అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన కూచిపూడి ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పలు అన్న వితరణ కార్యక్రమాలలో పాల్గొన్న తోట రామారావు



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ప్రతి ఏటా ఎంతో వైభవోపేతంగా జరిగే గణేష్ నవరాత్రులు కేవలం మతపరమైన వెడుకలు మాత్రమే కావని భక్తి సేవా భావాలను చాటి చెప్పి గొప్ప పండుగని జిల్లా బిఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ తోట రామారావు తెలిపారు. ఖమ్మం నగరంలో పలు గణేష్ మండపాల వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి ఆయా మండపాల ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు పాల్గొని అన్న ప్రసాద వితరణ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తొమ్మిది రోజులు ప్రజలు భక్తి పర్వంతో పూజలు నిర్వహించి ఆ స్వామివారి అనుగ్రహం పొందడం, వివిధ గణేష్ మండపాల ఉత్సవ కమిటీలు నిర్వహించే పలు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు గణేష్ నవరాత్రులకు ప్రత్యేక శోభను తీసుకు వస్తున్నాయన్నారు. ఈసారి కూడా మన ప్రాంతంలో అనేక గణేష్ మండపాల కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు, భక్తులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.స్వామివారి కృపా కటాక్షములతో మనమంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మంచి వర్షాలు, పచ్చని పాడిపంటలతో కలిసిమెలసి జీవన ప్రయాణాన్ని సాగించాలని తెలిపారు.తదనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న తోట రామారావు గారిని ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సైన్స్ సెమినార్‌లో రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన త్రివేణి విద్యార్థిని





**ఖమ్మం, సెప్టెంబర్ 16 , నేటి శుభోదయ :** జాతీయ సైన్స్ సెమినార్–2026లో భాగంగా "Indian Energy Basket 2047: Prospects అండ్ Challenges" అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో త్రివేణి పాఠశాల, ఖమ్మం శాఖకు చెందిన కె. వనిషా రెడ్డి ప్రథమ స్థానం సాధించారు. జిల్లా సైన్స్ మ్యూజియం, ఖమ్మంలో నిర్వహించిన ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా ఎంఈఓ శైలజ లక్ష్మి, డీఎస్ఓ ఎనుముల శ్రీనివాసరావు విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. విద్యార్థినికి పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ,వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా,ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.విద్యార్థినికి గైడ్ టీచర్స్ గా ఉపాధ్యాయులు బాలాజీ మరియు హిమమ్,షరీఫ్ లు వ్యవహరించారు.

# ప్రతి నీటి బొట్టు చాలా విలువైంది

- **డీవీఆర్ కు 70, ఎత్తిపోతుల కు 50 క్యూసెకుల నీటి విడుదల ఇరిగేషన్ డీఈఈ పొట్టయ్య**




**ఖమ్మం, సెప్టెంబర్ 16 , నేటి శుభోదయ :** ప్రస్తుత పరిస్థితులలో ప్రతీ నీటి బొట్టు చాలా విలువైందని నేలకొండపల్లి నీటి పారుదల శాఖ డీఈఈ పొట్టయ్య పేర్కొన్నారు. మండలం లోని చెరువుమాధారం ఎత్తిపోతుల పథకం కు బుధవారం నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి చుక్క కూడ వృధా కాకుండా ప్రతీ తూములను బంద్ చేయాలని సూచించారు. అప్పలనరసింహాపురం చెరువు కోసం 50 క్యూసెకుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. అదే విధంగా దేవినేని వెంకటరమణ కెనాల్ కు 70 క్యూసెకుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కెనాల్ ద్వారా వల్లభి, మల్లారాం చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతుల పథకం చైర్మన్ యలగాల భూషయ్య, నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ తీగ రమణయ్య, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ లు వెన్నపూసల సీతారాములు, వెనికె జానకిరామయ్య, శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, ఇరిగేషన్ ఏఈ లు నరేష్, రుత్విన్రెడ్డి, మధీనా, దీక్షితా తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో పర్యావరణానికి పెను ప్రమాదం

**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఖమ్మం, మధిర నియోజకవర్గాల పరిధిలోని రఘునాధపాలెం, చింతగుర్తి, మధిర, చింతకాని, మండల కేంద్రంలో పలు చోట్ల నుంచి మట్టి తవ్వకాలు, తరలింపులు యథేచ్ఛగా జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ భూముల నుండి మట్టిని తవ్వి వాహనాల్లో తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ఆ ప్రాంత వాసులు ప్రశ్నలు సంధిస్తున్నారు.--- చెరువు నుంచి మట్టి వాహనాల్లో తరలింపు స్థానికుల ఆరోపణల ప్రకారం.. ఖమ్మం, మధిర నియోజకవర్గాలలో గల పలు చెరువు ప్రాంతంలో యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపట్టి, భారీ వాహనాల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంత విస్తీర్ణంలో తవ్వకాలు జరిగాయి? ఎంత పరిమాణంలో మట్టి బయటకు తరలించారు? ఏ అవసరానికి తరలిస్తున్నారు? అన్న ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టత లేదని గ్రామస్తులు అంటున్నారు. ఈ అంశాలపై అధికారిక స్థాయి పరిశీలన జరగాల్సి ఉంది.--- అనుమతులు ఉన్నాయా? అధికారుల తనిఖీ ఎక్కడ?మట్టి తవ్వకాలు, ఖనిజాల తవ్వకం–రవాణాకు సంబంధించి సంబంధిత శాఖల అనుమతులు, పరిమితులు, రవాణా పత్రాలు వంటి అంశాలు కీలకం. తెలంగాణ గనులు–భూగర్భశాఖ అధికారిక వివరాల ప్రకారం, చిన్న ఖనిజాల తవ్వకాలు, రవాణాను నియంత్రించడం, అక్రమ తవ్వకాలను అరికట్టడం ఆ శాఖ విధుల్లో భాగం. ప్రభుత్వ భూములలో, చెరువులో జరుగుతున్న తవ్వకాలకు సంబంధించి ఏదైనా అనుమతి లేదా అధికారిక ఉత్తర్వు ఉందా? ఉంటే దాని పరిధి ఎంత? అనే విషయాలను అధికారులు ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.--- కథనాలు వచ్చినా, చర్యలు ఎందుకు లేవు? ప్రభుత్వ భూముల తోపాటు, చెరువులో మట్టి తవ్వకాలపై ఇప్పటికే పలు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మీడియాలో విషయం వెలుగులోకి వచ్చిన తర్వాతైనా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారా? తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని కొలిచారా? వాహనాలను తనిఖీ చేశారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా వినిపిస్తున్నాయి.--- తవ్వకాల వెనుక ఎవరు? బయటకు రావాల్సిన వివరాలు మట్టి తవ్వకాల వెనుక ఎవరు ఉన్నారు? తవ్వకాలకు అనుమతులు ఎవరు ఇచ్చారు? మట్టి తరలిస్తున్న వాహనాలు ఎవరివి? ఒకవేళ అనుమతులు ఉంటే అనుమతించిన పరిమాణం ఎంత, వాస్తవంగా తరలిస్తున్న పరిమాణం ఎంత? అన్నది అధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. చెరువు ప్రభుత్వ ఆస్తి, నీటివనరుగా నమోదై ఉంటే దాని రికార్డు వర్గీకరణ, తవ్వకాల వల్ల చెరువు సామర్థ్యంపై ప్రభావం వంటి అంశాలనూ పరిశీలించాల్సిన అవసరం ఉంది.--- ప్రభుత్వ భూములు, చెరువు రికార్డులపై స్పష్టత ఇవ్వాలి ప్రభుత్వ భూములు, చెరువులు ఏ శాఖ పరిధిలో ఉంది? రెవెన్యూ రికార్డుల్లో దాని విస్తీర్ణం ఎంత? ప్రస్తుత భౌతిక పరిస్థితి ఏమిటి? గతంలో ఏమైనా పూడికతీత లేదా మట్టి తొలగింపు పనులకు అనుమతులు ఇచ్చారా? ఇవన్నీ రికార్డుల ఆధారంగా అధికారులు వెల్లడించాల్సిన అంశాలే. అధికారిక రికార్డులతో క్షేత్రస్థాయి పరిస్థితిని సరిపోల్చితే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.--- మట్టి తరలింపు వాహనాలపై నిఘా ఎక్కడ? తవ్వకాలతో పాటు మట్టి రవాణాపైనా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి? ఏ మార్గంలో తరలిస్తున్నారు? రవాణాకు సంబంధించిన పత్రాలు ఉన్నాయా? అన్న అంశాలపై తనిఖీలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని స్థానికులు చెబుతున్నారు. అక్రమ తవ్వకం లేదా అక్రమ రవాణా నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.--- అధికారుల మౌనం, అనుమానాలకు తావిస్తున్నదా? ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్న సమయంలో సంబంధిత శాఖలు స్పందించకపోతే అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అక్రమం లేదంటే అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలి. అక్రమం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ వనరుల పరిరక్షణలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.--- "ఇకనైనా అధికారులు కదలాలి"ఖమ్మం కు కూత వేటు దూరంలో ఉన్న రఘునాధపాలెం, చింతగుర్తి, తదతర ప్రాంతాలలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న మట్టి తవ్వకాలపై రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ, సంబంధిత స్థానిక అధికార యంత్రాంగం సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తవ్వకాల విస్తీర్ణం, తొలగించిన మట్టి పరిమాణం, అనుమతులు, రవాణా పత్రాలు, భూమి రికార్డులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు మైనింగ్ అధికారులు ఈ పేరుతో పెద్ద మొత్తంలో లాభాలు పొందినట్లు తెలుస్తుంది. గత రెండు సంవత్సరాల నుండి పర్యావరణ పరిరక్షణ కోసం ఏ చర్యలు తీసుకున్నారో క్షేత్ర స్థాయిలో వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రెండు సంవత్సరాల పాటు ఆ శాఖ అధికారులు లంచంగా తీసుకున్న వివరాలను సైతం బయట పడనున్నాయి. తామంతా చుద్ద పూసలమం అని ఆ శాఖ జిల్లా అధికారి చెప్పడం వెనుక మర్మం ఏమిటో తెలియాలి మరి. ఈ రెండు సంవత్సరాల నుండి వారు సంపాదించిన నిధులపై ఏసిబి అధికారులు దాడులు చేస్తే మరిన్ని నిజాలు బయట పడనున్నాయి. ఇప్పటికైనా సంబంధించిన ఉన్నాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే లోతు అయినా సమాచారం బయటపడనుంది మరి.

# కూల్చివేతలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా : పువ్వాడ

- **శ్రీనివాస్ నగర్ బాధితులకు మాజీ మంత్రి పువ్వాడ మద్దతు**



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులకు ఆయన మద్దతు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం కొత్తగా నిర్మించిన ఇళ్ల కంటే, వివిధ కారణాలతో కూల్చివేసిన ఇళ్లే ఎక్కువగా ఉన్నాయని పువ్వాడ ఆందోళన వ్యక్తం చేశారు. వికాసం, అభివృద్ధి చేపట్టడం చేతకాని ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చివేసి వారి జీవనోపాధిపై ప్రభావం చూపడం సరికాదని, పేదల పొట్ట కొట్టే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇళ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు.తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు, పేదలకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమైతే, ఇప్పుడు పేదల ఇళ్లు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మిగిలిన ఘనతగా మారిందని ఆయన విమర్శించారు.

# పోరాటాల పురిటిగడ్డ "కుర్నవల్లి"






**ఖమ్మం, తల్లాడ, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ :** దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడ్డ పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. ప్రపంచమంతా స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జరుపుకుంటూ ఉంటే,తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతోన్న సమయమది. బానిస బతుకులతో తెలంగాణ ప్రజల రక్తం ఉడికిపోయింది. తెలంగాణ గ్రామాలలో రజాకార్ల దాష్టీకాలకు అంతులేకుండా పోయింది. మహిళల మాన,ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది.దీంతో తెలంగాణ సాయుధ పోరాటం రజాకార్లకు వ్యతిరేకంగా తెర మీదకు వచ్చింది.నిజం తాబేదార్లుగా జాగీర్దార్లు, జమీందార్లు,దొరలు, దేశ్ముఖ్లు,భూస్వాములు విచ్చలవిడిగా దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతుంటే ప్రశ్నించడం గానీ,ఎదిరించే శక్తి లేని ప్రజలు,కష్టాలను భరిస్తూ, వెట్టి చాకిరి చేస్తూ,కన్నీళ్లను మింగుతున్న తరుణంలో పీడిత ప్రజలకు అండగా ఆంధ్రమహాసభ రూపంలో ఆనాడు కమ్యూనిస్టు పార్టీ ప్రజలను సమాయత్త పరిచింది.సొంతిల్లు.. సొంతూరు..అయినా అనుక్షణం భయం,భయం. అయినవాళ్ల మధ్యనే ఉన్నా ఉలికిపాటు.గుర్రపు డెక్కల చప్పుడు వింటే గుండె దడ.రజాకార్ల పొలికేక విన్పిస్తే మృత్యువు ముంచుకొచ్చినట్లే. జీవితమే రణరంగంలా మారిన తరుణంలో ఆంధ్ర మహాసభ–కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో అయ్యా నీ భాంచన్ దొర కాల్మొక్తాన్న చేతులు బంధూకులు పట్టాయి.పలుగు,పార,కారం,రోకలి,వరిసెల,బరిసె అందిందల్లా ఆడ,మగ తేడా లేకుండా అందరికి ఆయుధాలుగా మారాయి.నైజాం రాజులను తరిమికొట్టడానికి ప్రత్యేక ఉద్యమ బలగాలు తయారయ్యాయి.నిజాం రాజులకు ఎదురుతిరిగి ముచ్చెమటలు పట్టించాయి.మహోన్నత చరిత్ర కలిగిన రైతాంగ సాయుధ పోరాటంలో తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానిది ప్రత్యేక స్థానం.ఇక్కడ రాజుకున్న నిప్పు..కుర్నవల్లి కేంద్రంగా చుట్టుపక్కల పది గ్రామాలకు పాకింది.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పురుషులతో సమానంగా మహిళలు పాల్గొని తమ వారికి అండగా నిలిచి భూమి,భుక్తి,విముక్తి కోసం పోరాడారు. పోరాటంలో అనేక కష్టాలను ఎదుర్కొని అజ్ఞాతంలో గడిపారు.నిజాం నవాబు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా రజాకార్లతో పోరాడి అమరులైన వారిలో కుర్నవల్లి గ్రామానికి చెందిన కొలికొండ రాఘవయ్య,బోడేపూడి బసవయ్య,బోడెపూడి సూరయ్య,బోడెపూడి శేషయ్య,బోడేపూడి పురుషోత్తం,బోడెపూడి పుల్లయ్య,కట్టా వెంకటేశ్వర్లు, కట్టా గోపయ్య,బత్తుల సుబ్బయ్య,పామర్తి సీతారాములు,షేక్ ఉమ్మర్ సాహెబ్,ఈలప్రోలు గోపయ్యలు ముఖ్యులు.జీవితంమే రణరంగంగా మారిన తరుణంలో ఆంధ్ర మహాసభ పేరుతో కమ్యూనిస్ట్ పార్టీ ఇచ్చిన పిలుపుతో వీరంతా సంఘంగా ఏర్పడి ముందుకు సాగారు.ఉద్యమకారులను అణచివేయడానికి నాడు రజాకార్లు గ్రామంలో తాగునీటి సౌకర్యం కోసం బావిని తవ్వుకుని(నేడు మిలిటరీ బావి)నివాసం ఏర్పాటు చేసుకున్నారు.దీంతో సంఘ సభ్యులంతా ఆంధ్రప్రాంతంలోని ఉమ్మడి దేవరపల్లిలో క్యాంప్ ను ఏర్పాటు చేసుకుని ఉద్యమాన్ని ఉద్ధృతం చేశారు.దీంతో సంఘ సభ్యుల పై నిజాం తొత్తులు దాడులకు గూండాలను ప్రయోగించిన,అక్రమ కేసులు బనాయించిన,జైలుకు పంపిన సంఘ సభ్యులు మాత్రం వెనుకడుగు వేయకుండా ఉద్యమం నడిపారు.ఇక దెబ్బకు దెబ్బ తప్పదని నిర్ణయించి నిజాం రాజులకు ఎదురు తిరిగి నైజాం రాజులను తరిమికొట్టడానికి ప్రత్యేక ఉద్యమ బలగాలుగా నడుం బిగించి ముందుకు సాగారు.ఆ పోరాటంలో కొలికొండ రాఘవయ్య, కట్టా వెంకటేశ్వర్లు అరెస్ట్ అయి మద్రాసు రాష్ట్రంలోని కడలూరు జైలులో జరిగిన ఎదురుకాల్పుల్లో కట్టా వెంకటేశ్వర్లు తల వెంట్రుకలను దూసుకుంటూ వెళ్ళిన తుపాకీగుండు కొలుకొండ రాఘవయ్య గుండెలను తాకి వీరమరణం పొందాడు. ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఉమర్ సాహెబ్ అజ్ఞాతంలోకి వెళ్ళిన సమయంలో వినగడపలో పట్టుకొని తిరువూరు జైలుకు పంపించి చిత్ర హింసలకు గురిచేయడంతో చావు అంచుల వరకు వెళ్లి తిరిగి వచ్చాడు.ఈ నేపథ్యంలోనే 1947 సెప్టెంబర్ 11వ తేదీన ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ నాయకులు రావి నారాయణ రెడ్డి,బద్దం ఎల్లారెడ్డి,మొహినుద్దీన్ సాయుధపోరుకు పిలుపునిచ్చారు. ఈ పిలుపుతో తెలంగాణ ప్రజలు సమరశంఖం పూరించారు.రజాకార్లను, నిజాం బలగాలను ఎదుర్కొనడానికి సంసిద్ధులైనారు.10వేల మంది గేరిల్లా దళ సభ్యులుగా,లక్ష మందికి పైగా రక్షక దళ సభ్యులుగా చేరారు.తెలంగాణాలోని దొరలు–భూస్వాములు,ప్రభుత్వ ఏజెంట్లు తప్ప,తెలంగాణా ప్రజలంతా ఒక్కటిగా కదిలారు.ప్రాణాలకు తెగించారు.లక్ష్యసాధనకు నడుంబిగించారు.ఊరూరా ఒక విప్లవ కేంద్రమయింది.ప్రతి వ్యక్తీ ఒక సైనికుడయ్యాడు.తెలంగాణ ఎరుపెక్కింది.ఆ సమయంలో పది లక్షల ఎకరాలు పేదలకు పంచిన కమ్యూనిస్టు పార్టీ వెయ్యి గ్రామాలకు పైగా పట్టుసాధించింది.భూస్వాములు,దొరలు గ్రామాలను వదిలి పట్టణాలకు పారిపోయారు.నాటి వీరోచిత పోరాటానికి తలొగ్గిన నిజాం నవాబు 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ యూనియన్లో విలీనం చేశాడు.భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ బుధవారం గ్రామస్థులు ఎర్ర జెండాలు చేతబూని పుర వీధుల్లో ప్రదర్శన చేసి అమరవీరులకు తమ ఘనమైన నివాళులు అర్పించారు.ఇలా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కుర్నవల్లి గ్రామానికి చెరగని ముద్రని ముద్రించిన కుర్నవల్లి అమరవీరులకు రెడ్ సెల్యూట్.

# త్రివేణిలో ఓజోన్ పరిరక్షణపై అవగాహన

- **వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**





**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** వరల్డ్ ఓజోన్ డేను పురస్కరించుకుని ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని త్రివేణి పాఠశాల, ఖమ్మం శాఖలో ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొర ప్రాధాన్యత, దాని క్షీణత వల్ల కలిగే ప్రభావాలు, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఓజోన్ పొర భూమిపై జీవరాశులకు రక్షణ కవచంగా పనిచేస్తుందని, దాని పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అవసరమని అన్నారు. పర్యావరణ హితమైన అలవాట్లను పాటిస్తూ, ప్రకృతి సంరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఓజోన్ పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తీకరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన టాప్–5 విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, నాన్–టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి




**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** భావి తరాలకు సమతుల వాతావరణ పరిస్థితులను కానుకగా ఇవ్వాలనుకుంటే ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలని ఎస్ఆర్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహమ్మద్ జాకిరుల్లా అన్నారు బుధవారం నాడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెమిస్ట్రీ విభాగం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు సందేశాన్ని అందించారు ఓజోన్ పొర నుండి మనకు హానికరమైన యూవీ కిరణాలు భూమి పై చేరకుండా గొడుగు లా పరిరక్షిస్తూ ఉందని తెలిపారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగాధిపతి డా.జి.వీరన్న, వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి. ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద అధ్యాపకులు డా.చందా సుధాకర్,పి.రామచంద్రరావు,డా.మౌలానా కరీం డా.సలీంపాషా,డా.యు.ఉదయలక్ష్మి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సన్మానం తో అభినందనలు



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** మున్నూరు కాపు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మదూరి సైదారావు కు బుధవారం ఖమ్మం నగరంలోని 39వ డివిజన్ కు సంబంధించిన మాజీ కార్పొరేటర్ మదూరి ప్రసాద్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ కార్యదర్శి బలుసు లక్ష్మి నాగేశ్వరావు దంపతులు కలిసి మున్నూరు కాపు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ మదూరి సైదారావు ను మర్యాదపూర్వకంగా అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ కార్యదర్శి బలుసు లక్ష్మి నాగేశ్వరావు దంపతులు మదూరి సైదారావు కు మిఠాయి పెట్టి శాలువాలుతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మున్నూరు కాపు సామాజిక వర్గం అభ్యున్నతి, ఐక్యత సంక్షేమం కోసం మదూరి సైదారావు మరింతగా కృషి చేయాలని ఆయన అభిమానులంతా కలిసి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ కాంగ్రెస్ పార్టీనాయకులు షేక్.అబ్బాస్, ఘని,రచ్చ రామారావు, మహిళ నాయకురాలు రేవతి, పద్మ, భానుమతి, రచ్చ కళ్యాణి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మహిళల విరోచిత పాత్ర




**ఖమ్మం, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం నవాబులను తరిమికొట ్టడ ంలో తెలంగాణ మహిళల పాత్ర హీరోచితమని ఐద్వా రాష్ట కార్యదర్శి మల్లు లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల భాగంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వీర వనితల స్ఫూర్తి యాత్ర తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు చేరుకున్న సందర్భంగా జరిగిన బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ముందుగా యాత్రకు మహిళలు కోలాట దళం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. అనంతరం బహిరంగ సభకు దొండేటి సుగుణమ్మ అధ్యక్షతన జరిగిన సభలోమల్లు లక్ష్మి మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటం కమ్యూనిస్టుల హక్కు అని నిజాం నవాబుల వ్యతిరేకంగా భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన మహోద్యమం కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిదని దీంతో పేద ప్రజలకు పది లక్షల ఎకరాల భూమిని పంచి పెట్టిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని సాయుధ పోరాటంలో నాలుగువేల మంది అమర యోధులు చనిపోయారని వేలాది గ్రామాలను విముక్తి చేసిన చరిత్ర కమ్యూనిస్టుల దేనని నేడు కొంతమంది దాన్ని వక్రీకరించి హిందూ ముస్లిం పోరాటం గా చిత్రీకరించటం బిజెపికి తగదని పేదోడి హక్కుల కోసం సాగిన పోరాటం అని ఆమె అన్నారు. ముందుగా అమరవీరుల స్తూపాలకు పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, రాష్ట్ర నాయకురాలు కే ఎల్ ఆశాలత, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి పద్మ, మెరుగు రమణ, రాష్ట్ర నాయకులు మాచర్ల భారతి, నందిపాటి పావని, వేగినాటి మంగతాయారు, దొండేటి సుగుణమ్మ, సర్పంచ్ కామల్ల సువార్త, సర్పంచ్ అరెంపల వినోద, సిపిఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బసీరుద్దీన్ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సిపిఎం సీనియర్ నాయకులు దొండేటి ఆనందరావు, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, పద్మనాభల సుధాకర్ రావు, చల్లా వెంకటేశ్వర్లు, దొండేటి నిర్మలావు, దొడ్డ లింగస్వామి, చల్లా వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, పప్పుల చిన్న ఉపేందర్, పప్పుల ప్రసాద్, కామల్ల సునీల్, వీరభద్రం, తుళ్లూరు నాగేశ్వరావు, దామోదర్ రెడ్డి, గోపోజురవి తదితరులు పాల్గొన్నారు.

## రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం - అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం ముదిగొండ మండలం ఖానాపురం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని తో పాటు, సరిహద్దు రైతుల సమక్షంలో జరగాలని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఏలాంటి అభ్యంతరాలకు గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ తహసీల్దారు రవి కుమార్, అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి

- **టీఎస్కేసి & కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో 18న జాబ్ మేళా**

**ఖమ్మం , సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** స్థానిక ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల లో గల తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్ జూనియర్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు జాబ్ మేళా ను 18 న సెమినార్ హాల్లో ఉదయం 11గంటలనుండి నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు.డిగ్రీ పూర్తి చేసిన పురుషులు, ద్విచక్ర వాహనం ఉండి ,27 సంవత్సరాల లోపు ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.ఇతర వివరాలకు కళాశాల టిఎస్కేసి లో సంప్రదించాలని సూచించారు

## జన సముద్ర గర్జన...!!

ఎగిరే ఎర్రజెండా ల సాక్షిగా,
కదిలింది ఒక అఖండ
జన ప్రవాహం!
హక్కుల కోసం,
ఆశయాలకోసం,
చాటింది ఈ వేలాది
హృదయాల ఐక్య రాగం!
అలల సవ్వడిని మించిన
నినాదాలతో,
సముద్ర తీరమే ఒక విప్లవ
వేదికై నిలిచింది!
కలిసి నడిచే ప్రతి శ్రామికుడి
అడుగులో,
సమ సమాజ స్వప్నం
ఉప్పొంగింది !
జాతి గమ్యాన్ని మార్చే శక్తిగా,
కదం తొక్కుతూ సాగింది
ఈ జన ప్రవాహం!
అన్యాయాలను ఎదిరించే ఆయుధమై,
గర్జిస్తోంది ఇక్కడ ప్రతి గళం!
ఎన్ని అడంకులు ఎదురొచ్చినా,
ఒక్కటై నిలిచే సైన్యం ఇది!
సామాన్యుడి ఆకలి మంటల నుండి,
పుట్టుకొచ్చిన మహా సైన్యం ఇది !
చేతులు కలిపి, అడుగులుకలిపి,
సరికొత్త రేపటిని నిర్మించేందుకు,
విజయ కాంతుల వైపు సాగుతున్న,
అజేయమైన ...అరుణారుణ మహా ప్రస్థానం ఇది !





( గిరి ప్రసాద్ సోముల.., జర్నలిస్ట్ )

## ఎంబిబిఎస్ సీట్ సాధించిన ఏక్తా రుక్మిణి కి ఘన సన్మానం

- **ఉస్మానియాలో ఎంబిబిఎస్ సీట్ సాధించిన మూడోవతారం రొంపి మళ్ళా గ్రామ వాసి**
- **ఉఎంబిబిఎస్ విద్యాలో ఆదర్శంగా నిలుస్తున్న రొంపిమాళ్ళ గ్రామం**



**ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :**
మధిర మండల పరిధిలోని రొంపిమళ్ళా గ్రామంలో మంగళ వారం జై భీమ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల నీటి ఫలితాలలో ఉత్తమ ర్యాంకు సాధించి ప్రతిష్టాత్మకంగా ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించిన ఏక్తా రుక్మిణి ఘనంగా సన్మానించారు. తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రొంపిమల్ల గ్రామ సర్పంచ్ బాజినేని మల్లేశ్వరి ఆంజనేయులు, గ్రామ ఉప సర్పంచ్ తలపురెడ్డి నాగేంద్ర శ్రీనివాస్ రెడ్డి ,మాజీ ఉప సర్పంచ్ గొల్లమందల సునీత, మల్లారం సర్పంచ్ మందడపు లక్ష్మి ఉపేందర్ , సిరిపురం గ్రామ సర్పంచ్ దుంప పద్మా వెంకటేశ్వర్ రెడ్డి, రొంపి మల్ల హెచ్ఎం పిల్లి నరసింహారావు, స్కూల్ టీచర్ రాజు పాల్గొని ప్రసంగించారు .ఈ సందర్భంగా శంకరణ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఐనలా సైదులు ప్రధాన వక్తగా హాజరై విద్యార్థులను గ్రామస్తులు ఉద్దేశించి ప్రసంగించారు. ఉన్నత విద్యను కేవలం మార్కుల కోసం కాకుండా క్రమశిక్షణ నేర్పుతో కూడిన అంకిత భావంతో చదవాలన్నారు. ఉద్యోగం పొందటానికి కాదని జ్ఞానాన్ని ఉన్నతంగా బ్రతకటానికి కావలసిన సాధనంగా భావించాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా తీర్చి దిద్దించినప్పుడే ఉత్తమ సమాజం ఏర్పడుతుందన్నారు. మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో తల్లిదండ్రులు స్నేహితులు పరిసరాలు కూడా ప్రభావితం చేస్తాయని అన్నారు. చదువును ఒత్తిడిగా కాకుండా ఆనందిస్తూ సవాల్గా తీసుకొని ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వైద్య విధానంలో అడుగు వేసిన ఏక్తా రుక్మిణికి నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని వారి తల్లిదండ్రుల కలలను నెరవేర్చటం అభినందనీయమని అన్నారు . రొంపిమల్ల గ్రామ చరిత్రలోనే మూడు తరాలలో తొమ్మిది మంది డాక్టర్లుగా ఎదగటం ఒక చిన్న గ్రామం నుండి 90 మందికి పైగా గ్రాడియట్స్ ఉండటం అనేది రొంపి మల్ల గ్రామం విద్యా చైతన్యానికి నిదర్శనం అన్నారు. ఇది ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. చదువే ఆస్తి చదివే భవిష్యత్తు ఒక విద్యార్థి బాగా చదివితే ఒక కుటుంబం బాగుపడుతుంది ఒక గ్రామం చదువుకుంటే బాగుపడుతుంది అని ఆ గ్రామస్తులకు ఉద్బోధించారు. అనంతరం గొల్లమందల ఏక్తాలు రుక్మిణి ఆమె తల్లిదండ్రులు మోహన్ దాస్, క్రాంతి కుమారి నలుని శాలువాతో సత్కరించి జ్ఞాపకం అందజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షురాలు గొల్లమందల అరుణ కుమారి, ఫౌండర్ కారుమంచి లక్ష్మి తిరుపతమ్మ, ట్రెజరరీ ప్రవీణ్ కుమార్, గొల్లమందల నాగేశ్వరరావు, గొల్లమందల బాబురావు, గొల్లమందల రవీంద్ర ,వేల్పుల ప్రదీప్ ,కారుమంచి కృష్ణ, తడకమళ్ళ బాబు , బలగాని నాగరాజు, తదితరులు పాల్గొన్నారు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు కంభంపాటి రవి, కనకపుడి రాము, స్నేహితుడు కనకపుడి మురళి, డాక్టర్ రాఘవేంద్ర, రిటైర్డ్ ఎంప్లాయ్ చెంచులు, గొల్లమందల వెంకటేశ్వర్లు ,గ్రామ పెద్దలు ఓబుల లక్ష్మారెడ్డి ,శీలం రామిరెడ్డి, శీలం కృష్ణారెడ్డి, తలపరెడ్డి నారాయణరెడ్డి, గొల్లమందల ఆనందరావు, షేక్ లతీఫ్, షేక్ అలా కుద ,మడుపల్లి వెంకటేశ్వర్లు, మడుపల్లి బాబురావు, తెల్లూరి కొండలరావు, కంచర్ల సతీష్, కంచర్ల గణేష్, గొల్లమందల కొండలరావు, తడికమళ్ళ వెంకటేశ్వర్లు, గొల్లమందల లక్ష్మణరావు, మాతంగి అనిల్ కుమార్, గొల్లమందల తిరుపతిరావు, గొల్లమందలు రమే,ష్ విద్యార్థులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా సన్మానించి హర్షం వ్యక్తం చేశారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





- **అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలి**
- **మండలానికి ఒక సాండ్ బజార్ ఏర్పాటుచేయాలి**
- **రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పై మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమీషనర్లు, తహసీల్దార్ లు, హౌజింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపి క పై అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూర్చాలన్నారు. లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీల న తప్పనిసరి అని అన్నారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన లబ్ధిదారుల పేర్లను అధికారులు స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి, అర్హతలను ధృవీకరించిన తర్వాతే ఆన్‌లైన్ మోడ్‌లో అప్రూవల్స్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అర్హత కలిగి, స్వంత స్థలం ఉన్నవారికి నేరుగా గెజిటెడ్ అధికారులు పరిశీలించి, ఎంపీడీఓ ద్వారా కలెక్టర్ లాగిన్‌కు పంపిన వెంటనే మంజూరు ఇవ్వబడుతుందన్నారు. అర్హత ఉండి, ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం లేనివారు, గతంలో ఇల్లు మంజూరైనవారు, ఫోర్ వీలర్ ఉన్నవారు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు లేదా సాంకేతిక లోపాల వల్ల ఇనెలిజిబుల్ జాబితాలోకి వెళ్లినవారు తదితర విచారణల్లో పొరపాట్లు జరగొద్దన్నారు. గతంలో తప్పుడు సమాచారం లేదా సర్వే లోపాల వల్ల అర్హులైన పేదలు ఎల్ 3 జాబితాలోకి వెళ్లడం జరిగిందని, ఈసారి అటువంటి తప్పిదాలు పునరావృతమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పని చేసి 100 శాతం ఆన్‌లైన్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా అధికారులు పూర్తి పట్టుతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు కావలసిన ఇసుక అవసరాలను అంచనా వేసి డేటా సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు. పంచాయతీకి సమీపంలో ఉన్న ఉచిత ఇసుక లభ్యత స్థలాలను రెవెన్యూ, నీటిపారుదల, ఫారెస్ట్ శాఖల పరిధిలోనివి గుర్తించి వివరాలు అందించాలన్నారు. ఇసుక కొరత ఉన్న మండలాల్లో గోదావరి లేదా ఇతర ప్రధాన వనరుల నుండి ఇసుకను తెచ్చి నిల్వ చేయడానికి ప్రతి మండలానికి ఒక ఇసుక బజార్ స్థలాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పై. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, హౌజింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620